RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| | | | | | |
|---|---|---|---|---|---|
| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 100 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | బుధవారం,అక్టోబర్,8,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 100 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Wednesday,October,8,2025 | PAGES : 8 RS : 4 /- |





## పాకిస్థాన్ బండారం బయటపెట్టిన.. భారత్

### ఐరాసలో దిమ్మతిరిగే కౌంటర్

- ఐరాసలో 1971 బంగ్లా సామూహిక అత్యాచారాలను గుర్తుచేసిన భారత ప్రతినిధి
- పాక్ ప్రచారాన్ని ప్రపంచం నమ్మదంటూ వ్యాఖ్యలు

ఐక్యరాజ్యసమితి : ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కశ్మీర్ అంశాన్ని లేవనెత్తి, అసలు విషయాన్ని పక్కదారి పట్టించాలని చూసిన పాకిస్థాన్‌కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది. పాకిస్థాన్ బూటకపు ప్రచారాన్ని తిప్పికొడుతూ, 1971లో బంగ్లాదేశ్‌లో పాక్ సైన్యం జరిపిన 'సామూహిక అత్యాచార మారణహోమం' గురించి గుర్తుచేసి దాని నిజ స్వరూపాన్ని ప్రపంచం ముందు నిలబెట్టింది. భద్రతా మండలిలో 'మహిళలు, శాంతి, భద్రత' అనే అంశంపై చర్చ జరిగింది. ఈ చర్చలో పాకిస్థాన్ ప్రతినిధి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ అనూహ్యంగా కశ్మీర్ విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై తీవ్రంగా స్పందించిన ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పి. హరీశ్, పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.





## బిసి రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ

హైదరాబాద్, : బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్న ఈ వ్యవహారంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షి స్తున్నారు.

**మంత్రులు అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష అభిషేక్ సింఘ్వీతో తాజాగా చర్చ**

న్యూఢిల్లీ, : ఈ ఏడాది భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ వరించింది. ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో మాక్రోస్కోపిక్ క్వాంటం మెకానికల్ టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్ ఆవిష్కరణకు శాస్త్రవేత్తలు జాన్ క్లార్క్, మైఖేల్ డెవోరెట్, జాన్ మార్టినిస్‌లకు 2025 భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చినట్లు మంగళవారం నోబెల్ కమిటి తెలిపింది. జాన్‌క్లార్క్, మిచెల్‌హెచ్. డివోరెట్, జాన్.ఎం మార్టిన్స్‌లు ముగ్గురు ఈ అవార్డను సంయుక్తంగా గెలుచుకున్నారు. నోబెల్ భౌతిక శాస్త్ర బహుమతిని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రదానం చేస్తుంది. బహుమతి గెలుచుకున్న ముగ్గురికి మొత్తం 11 మిలియన్ స్వీడిష్ కిరీటాల (శ్రీ1.2 మిలియన్లు) బహుమతి రానుంది. ఈ మొత్తా న్ని వాళ్లు ముగ్గురు పంచుకో నున్నారు. ఇప్పటికే తొలి నోబెల్ బహుమతి వైద్య రంగంలో ముగ్గురు వైద్యులకు సంయుక్తంగా లభించింది. మిగిలిన విభా గాల్లో నోబెల్ బహుమతుల విజేతల పేర్లను అక్టోబర్ 13వతేదీ వరకు ప్రకటించనున్నారు. ప్రముఖ వ్యాపా రవేత్త, శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ మరణం తరువాత ఈ నోబెల్ బహుమతులు అందజేస్తున్నారు.




## భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

### ప్రకటించిన నోబెల్ కమిటీ




## ఆప్ నేత కేజ్రీవాల్‌కు ఊరట

### ఢిల్లీ లోధి ఎస్టేట్‌లో టైప్ 7 బంగళా కేటాయింపు

న్యూఢిల్లీ, : ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్రం ఎట్టకేలకు అధికారిక నివాసం కేటాయించింది. ఇకపై 95, లోధి ఎస్టేట్‌లో టైప్ 7 బంగళాలో ఆయన ఉండనున్నారు. ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం గత ఏడాది అక్టోబరులో ఆయన సీఎం అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన విషయం తెలిసిందే. అయితే.. ఢిల్లీలో మాజీ ముఖ్యమంత్రులకు ప్రభుత్వ వసతి కేటాయించే నిబంధన లేదు. దీంతో ఆయన ఆప్ రాజ్యసభ ఎంపీ అశోక్ మిత్తల్‌కు కేటాయించిన లుటియన్స్‌లోని ఫిరోజ్‌షా రోడ్డులో ఉన్న 5వ నంబరు బంగళాలో తాత్కాలికంగా ఉంటున్నారు. ఈక్రమంలోనే గుర్తింపుపొందిన జాతీయ పార్టీ అధ్యక్షుడిగా కేజ్రీవాల్ కు తగిన నివాసం కేటాయించాలంటూ ఆప్ న్యాయపోరాటం చేసింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం నూతన బంగళాను కేటాయించింది.




## ఆ మంత్రి నాపై చేసిన వ్యాఖ్యలకు స్పందించను!

### పార్టీ పరంగా మహేశ్ కుమార్ గౌడ్ ఇచ్చిన ఆదేశాలు పాటిస్తానని పొన్నం స్పష్టీకరణ

కరీంనగర్,తెలంగాణ దిశ :మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తనను అహంకారి గా అభివర్ణిస్తూ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించా రు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తనతో మాట్లాడారని, ఆయనతో జరిగిన సంభాషణే ఫైనల్ అని పొన్నం తెలిపారు. రహ్మత్ నగర్ సమావేశంలో చోటుచేసుకున్న విషయాలను పీసీసీ అధ్యక్షుడికి వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించబోనని ఆయన స్పష్టం చేశారు. పార్టీ పరంగా మహేశ్ కుమార్ గౌడ్ ఇచ్చిన ఆదేశాలను తప్పకుండా పాటిస్తానని ఆయన అన్నారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో విభేదాల గురించి ప్రశ్నించగా అడ్లూరి లక్ష్మణ్ తీవ్రంగా స్పందించారు.



## సిరిసిల్లలో కన్నుల పండువగా.. వెంకన్న రథోత్సవం

రాజన్న సిరిసిల్ల జిల్లా ,తెలంగాణ దిశ :రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గోవింద నామస్మరణతో పులకరించింది. శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహారథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ రథోత్సవాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వామివారిని దర్శించుకున్నారు. సిరిసిల్ల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సెప్టెంబర్ 30వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. తిరుమల తిరు పతి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల తరహాలోనే ఇక్కడ సైతం ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామివారి వాహన సేవలు జరుగుతుంటాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారు ఉభయదేవేరులతో కలిసి రథంపై పురవీధుల్లో విహరించారు. అంతకు ముందు ఆలయంలో హోమం, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ప్రతిష్టించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు రథంపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం సమయంలో రథోత్సవం నిర్వహించగా.. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జాతరకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## అర్థం కానీ కవిత వ్యూహం

హైదరాబాద్,తెలంగాణ దిశ :భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేయడంతో కవిత పూర్తి స్థాయి జాగృతి నేతగా మారిపోయారు. ఎమ్మెల్సీ పదవి కి చేసిన రాజీనామాను ఆమోదించినా ఆమోదిం చకపోయినా ఆ పదవి లేనట్లుగానే వ్యవహరి స్తున్నారు. ఇప్పుడు జాగృతిని బలోపేతం చేసుకునేందుకు కార్యవర్గాన్ని నియమించారు. జిల్లాల వారీగా క్యాడర్ ను రెడీ చేసుకుంటు న్నారు. అయితే ఇప్పటి వరకూ ఆమె జాగృతిని రాజకీయ పార్టీగా ప్రకటించలేదు. జాగృతిలో పదవులన్నింటినీ మైనార్టీలు, గిరిజనులకే కేటాయిస్తున్నారు. ప్రధాన పదవుల్లో వారినే నియమిస్తున్నారు. ఇంత కాలం వారికి ఏ పార్టీలోనూ రాజకీయ ప్రాధాన్యత దక్కడం లేదని అంటున్నారు. అందుకే తాను ప్రాధా న్యం ఇస్తున్నానంటు న్నారు. ఇక బీసీల ఎలాగూ ఉద్యమం చేస్తున్నారు. అదే విషయాన్ని గొప్ప గా చెప్పుకుంటున్నారు. ఇప్పటికే సోషల్ మీడియాను కూడా కాస్త బలంగానే నిర్వహిస్తున్నారు. ఇదంతా చేస్తున్న కవిత జాగృతిని రాజకీయ పార్టీగా ప్రకటించడం మాత్రం మర్చిపోయారు.



### దేశం నివ్వెర పోయే ఘటన

## చీఫ్ జస్టిస్‌పై దాడి అత్యంత హేయం

న్యూఢిల్లీ,: దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై మదం తలకెక్కించుకున్న ఓ న్యాయవాది బూటు విసిరి దాడికి యత్నించిన ఘటన అత్యంత హేయమైన చర్యగా చూడాలి. ఇది మాటలకు అందని ఆందోళనకర ఘటనగా చూడాలి. సుప్రీం కోర్టులో ఓ న్యాయవాది ఎంత మదమెక్కిన వాడు అయితే తప్ప ఇలాంటి ఉన్మాద చర్యకు పాల్పడడు. ఈ ఘటన దేశం యావత్తూ ఆందోళనకు గురిచేసింది. ప్రధాన న్యమూర్తిపైనే దాడికి తెగబడడం క్షమించరాని నేరం. సోమవారం అత్యున్నత న్యాయస్థానంలో, అదీ ఒక కేసు విచారణ సందర్భంగా వాదనలు జరుగుతుండగా దుండగ మనస్తత్వం నిలువెల్లా నింపుకున్న ఒక లాయర్ ఎలాంటి జంకుగొంకూ లేకుండా చీఫ్ జస్టిస్ పోడియం వైపు దూసుకెళ్లి దాడికి తెగబడటాన్ని తీవ్రంగా పరిగణించాలి.



## స్థానిక ఎన్నికల్లో పోటీకి మల్లన్న సిద్ధం

### పార్టీకి గుర్తు కేటయించాలని హైకోర్టులో పిటిషన్

### తగు చర్యలు తీసుకోవాలసి ఇసిని ఆదేశించిన హైకోర్టు

హైదరాబాద్,తెలంగాణ దిశ :తెలంగాణ రాజ్యాధికార పార్టీస్థానిక ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. బిసిలకు రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడ్డ ఈ పార్టీ రానున్న స్థానిక ఎన్నికల్లోసత్తా చాటాలని చూస్తోంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాప కులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ పార్టీ గుర్తింపు, పార్టీ గుర్తుపై హైకోర్టులో మల్లన్న పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేం దుకు వీలు కల్పించాలని పిటిషనర్ నవీన్ కోరారు.

# మల్లంపేట విజయలక్ష్మి విల్లాస్ లో మళ్లీ అక్రమ నిర్మాణాలు... ఆకుల సతీష్

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :**సర్వే నెంబర్ 170/3,4 మల్లంపేట జిఎల్ఎస్ లక్ష్మీ శ్రీనివాస కన్స్ట్రక్షన్ నందు మళ్ళీ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమి ఎఫ్టిఎల్ బఫర్ జోన్ లో నిర్మాణాలు చేయడంపై మంగళవారం దుండిగల్ మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వోలకు ఆకుల సతీష్ ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లంపేట గ్రామం జిఎస్ఎల్ కాలనీ గతంలో బిల్డర్ విజయలక్ష్మి లక్ష్మీ శ్రీనివాస కన్స్ట్రక్షన్ పేరుతో అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో, కత్వ చెరువు ఎఫ్ టిఎల్, బఫర్ జోన్ లో విల్లాస్ నిర్మాణాలు చేయడమే కాకుండా, అమాయకులైన ప్రజలకు అమ్ముకోవడం విల్లాస్ వారు కొనడం తర్వాత చెరువు ఎఫ్ఎల్ బఫర్ జోన్ లో విల్లాల కూల్చివేతలు చేశామన్నారు. అంతే కాకుండా ప్రభుత్వ భూమి, చెరువు ఎఫ్ టిఎల్, బఫర్ జోన్లో అక్రమ నిర్మాణాలు చేసిన లక్ష్మీ శ్రీనివాస కన్స్ట్రక్షన్ యజమాని విజయలక్ష్మి పై పోలీస్ కేసు నమోదు చేయడం కూడా జరిగిందన్నారు. కానీ సంవత్సరకాలం తర్వాత ఇదే లక్ష్మీ శ్రీనివాస కన్స్ట్రక్షన్ చేపట్టిన జిఎల్ఎస్ కాలనీ నందు రోడ్డు నెంబర్ 11 %శీ% 10 మధ్యలో దాదాపు ఎకరం స్థలం నందు సర్వే నెంబర్ 170/3, 170/4 సంబంధించిన ప్రభుత్వ భూమిలో టి ఎస్ బి పాస్ ఇన్స్టంట్ ఒక అనుమతితో ఆరు విల్లాస్ నిర్మాణాలు గత నెల రోజులుగా జరుగుతున్నాయన్నారు. 3 విల్లాల నిర్మాణానికి టీఎస్ బి పాస్ ఇన్స్టంట్ ద్వారా అనుమతులు పొందడం, మళ్ళీ ఏమైందో తెలియదన్నారు. మున్సిపల్ అధికారులు వాటిని రద్దు చేయడం జరిగిందన్నారు. ఒక అనుమతితో శ్రీ వినాయక రియల్టర్స్, డెవలపర్స్ పేరుతో అనుమతులు పొంది నిర్మాణం ఏ విధంగా చేస్తున్నారో మున్సిపల్, రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. సర్వే నెంబర్ 170/3, సర్వే నెంబర్ 170/4 నందు ప్రభుత్వ భూమి ఉందన్నారు. గతంలో ఇదేవిధంగా సరైన అనుమతులు ఉండకుండా ప్రభుత్వ భూమి చెరువులో నిర్మాణాలు, కొనుగోలు చేసిన ప్రజలు పడిన ఇబ్బందులు చూసిన మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఒకే ఒక తప్పుడు అనుమతితో ఆరు విల్లాల నిర్మాణం జరుగుతున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తక్షణమే అనుమతులు లేని తప్పుడు అనుమతులు, ప్రభుత్వ భూమి, కత్వ చెరువు బఫర్ జోన్ నందు నిర్మాణాలు చేస్తున్న శ్రీ వినాయక రియల్టర్స్, డెవలపర్స్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపి వేయడమే కాకుండా, ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని



మరియు ప్రభుత్వ భూమిలో నిర్మాణాల చేసిన శ్రీ వినాయక రియాల్టర్స్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. లేని పక్షంలో గతంలో విజయలక్ష్మి విల్లాస్ కొనుక్కుని ప్రజలు పడిన కష్టాలు మరొకసారి పునరావత్తమయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చందు, పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

## - జిల్లా కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :**సమాచార హక్కు చట్టం –2005 వారోత్సవాలలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జిల్లా, డివిజన్, మండల స్థాయి కార్యాలయాల వారిగా ప్రజల కోసం అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 5 నుండి 12వ తేది వరకు సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో ఈ అవగహన సదస్సులను ఏర్పాటు చేసి ప్రజలకు సమాచార హక్కు చట్టం గురించి తెలియజేయడమే కాకుండా, ఈ చట్టాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలి, చట్టం వల్ల కలిగే ప్రయోజనం గురించి ప్రజలలో పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

# రాజీవ్ గృహకల్ప కాలనీ సమస్యలు పరిష్కరించాలి





**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :**నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నేతలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహమ్మద్ సాబీర్ అలీని కోరారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ నాయకుడు రామచంద్రనాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా తొలుత కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హనుమంత్ రెడ్డిని కలిసి కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను చేపట్టాలని కోరారు. అదే విధంగా సిసి రోడ్లను నిర్మించాలని కోరారు. హనుమంత రెడ్డి సూచన మేరకు నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ సాబీర్ అలీకి వినతిపత్రం సమర్పించారు. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టాల్సిన అధికారులు గత కొంతకాలంగా డ్రైనేజీ పనుల అనంతరమే సిసి రోడ్లు వేస్తామంటూ చెబుతున్నారని కమిషనర్ కు వివరించారు. ప్రధానంగా అంబేద్కర్ విగ్రహం నుండి బ్లాకు నెంబర్ 55 వరకు, 69, 70, 71 బ్లాక్ ల వైపు ఉన్న రోడ్లను, మదర్ మదర్ థెరిసా విగ్రహం నుండి సాయిబాబా ఆలయం వరకు, బ్లాక్ నెంబర్ 75 నుండి రాజధాని హైస్కూల్ వెళ్లే మార్గం వరకు రోడ్ల నిర్మించాలని కమిషనర్లు కోరారు. సాధ్యమైనంత త్వరలో రాజీవ్ గృహకల్ప సముదాయంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, రోడ్లను వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాషువా, రాందాస్, జార్జ్, నవీన్, రాజేష్, ఎల్లా స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన బిఆర్ఎస్ నాయకులు

**చర్లపల్లి, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :**చర్లపల్లి డివిజన్ పరిధిలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న రూ కోటి అభివృద్ధి పనులను మంగళవారం స్థానిక బిఆర్ఎస్ నేతలు పరిశీలించారు. డివిజన్ పరిధిలోని బిఎన్ రెడ్డి నగర్, ఈసీ నగర్, విఆర్ కాలనీలలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కాలనీవాసులతో కలిసి అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్ ఆయన మాట్లాడుతూ కాలనీలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి అత్యధిక నిధులు మంజూరు చేశారని అన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు ఉండే విధంగా చర్యలు తీసుకునేందుకు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎన్ రెడ్డి కాలనీ అధ్యక్షుడు దామోదర్



చారి, సుభాస్, నవీన్, సత్యనారాయణ, మూర్తి, బిక్షపతి, రంజిత్ కుమార్, దప్పు గిరిబాబు, బొడిగ రాజు, కొల నరేష్, వేణు గోపాల్ రెడ్డి, కొమ్ము రమేశ్, బాలరాజు, కోటేష్, నయీం, రెడ్డి నాయక్, రాజు, ఆంజనేయులు, లోక్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలి

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :**దేశ అత్యున్నతమైన న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడానికి సిద్ధపడ్డ వ్యక్తిని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ హమాలీ అడ్డా వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ దాడిని సనాతన ధర్మంతో ముడి పెట్టడం దివాలా కోరు రాజకీయమని అన్నారు. దాడికి యత్నించిన వ్యక్తిని నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం పేరుతో హింసను ప్రోత్సహిస్తే సనాతన ధర్మం కూడా ఒప్పుకోదన్నారు. సనాతన ధర్మంపై పేరిట దాడులు చేయడం బెదిరింపులు బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పెరిగిపోయాయని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో రాజకీయాలు చేస్తే ప్రజలు ఒప్పుకుంటారని భావించడం తప్పుడు ఉద్దేశమన్నారు సనాతన ధర్మం పేరిట దాడులు చేస్తే సహించేది లేదని



హెచ్చరించారు. ఇది న్యాయమూర్తి పై జరిగిన దాడి కాదని రాజ్యాంగంపై, భావవ్యక్తీకరణ పై జరిగిన దాడి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్, కార్యవర్గ సభ్యులు నర్సింహారెడ్డి, సిపిఐ నాయకులు శ్రీనివాస్, దేవేందర్, ప్రవీణ్, బాలయ్య, కిష్టయ్య, నాగేశ్వర్, శ్రీనివాసులు, జంబూ తదితరులు పాల్గొన్నారు.

# అడ్వాన్స్డ్ టెక్నాలజీస్ సెంటర్ లో పెండింగ్ పనులను పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ మను చౌదరి





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :**అడ్వాన్స్డ్ టెక్నాలజీస్ సెంటర్ (ఏటీసీ)లో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అల్వాల్ లోని ఐటిఐ కాలేజీలో నూతనంగా ప్రారంభించిన ఏటీసీ సెంటర్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ టి సి సెంటర్ లో పెండింగ్ లో ఉన్న ఏసీ ఫిట్టింగ్, కంప్యూటర్ ఇన్ స్టాలేషన్ వంటి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సెంటర్ లోని మిషనరీ, తరగతి గదులను పరిశీలించారు. మొత్తము ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, ఎన్ని ట్రేడ్ లున్నాయని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క ట్రేడ్ లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, వారికి సరిపడా బోధన సిబ్బంది ఉన్నారా అని ఆరా తీశారు. టెక్నాలజీ కోర్సులలో ప్రాక్టికల్, థీయరీ క్లాసులు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. బోధన సిబ్బంది సమాధానం ఇస్తూ వర్క్ షాప్ రూఫ్ లీకేజ్ అవుతుందని, పారిశుద్ధ్య సిబ్బంది కొరత ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ పర్యటనలో డిఓ శేఖర్ రెడ్డి, సూపరింటెండెంట్ శైలజ, బోధన సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్రీకాంత్ భరత్ ను అరెస్ట్ చేయాలి

## - వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిమాండ్

**హైదరాబాద్, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :**జాతిపిత మహాత్మా గాంధీ పై అసభ్యకర అనుచిత వ్యాఖ్యలు చేసిన టాలీవుడ్ నటుడు శ్రీకాంత్ భరత్ ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది. మంగళవారం హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఇరుకుల్ల రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచమంతా శాంతి దూతగా పిలుచుకునే పూజ్య బాపూజీ మహాత్మా గాంధీ గురించి వివిధ సామాజిక మాధ్యమాల్లో శ్రీకాంత్ భరత్ చేసిన వ్యాఖ్యలను తొలగించాలని అతనిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరాధ్య దైవంగా జాతీయ పితగా కొలవబడుతున్న మహాత్మా గాంధీ గురించి నోటికొచ్చినట్లు మాట్లాడడం ఉన్మాద చర్య అవుతుందని వారు అభివర్ణించారు. ఉన్మాదిగా వ్యవహరించిన శ్రీకాంత్ భరత్ ను కఠినంగా శిక్షిస్తే ఇకముందు



మిగతావారు అదుపులో ఉంటారని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల్లో ఉన్న తమ క్లబ్ ర్యాలీగా పోలీస్ స్టేషన్కు వెళ్లి వినతిపత్రం ఇస్తుందని దీనిపైన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ గార్లపాటి శ్రీనివాస్ సర్వీస్ సెక్రటరీ బోడా ప్రకాష్ కోశాధికారి సుజాత రమేష్ యాదవ్ నాగేశ్వరరావు రేణికుంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# చీఫ్ జస్టిస్ పై దాడి హేయమైన చర్య

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ పై జరిగిన దాడిని కుల వివక్ష పోరాట సమితి మేడ్చల్ జిల్లా కార్యదర్శి నాగనిగళ్ళల బాల పీరు తీవ్రంగా ఖండించారు. మంగళవారం నిజాంపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుడు రాథోడ్ సంతోష్, సి రాజు, ఆశీర్వాదం, వెంకటేష్, తుకారాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కెవిపిఎస్, సిఐటియు జిల్లా నేతలు మాట్లాడుతూ సిజెఐపై జరిగిన దాడి రాజ్యాంగంపై జరిగినట్లు భావించాల్సి వస్తుందన్నారు. సిజెఐకి సంఘీ భావంగా దేశమంతా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సమాజంలో ద్వేషం, మతోన్మాదం పెరగడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్వతంత్ర న్యాయ వ్యవస్థపై ఈ విధమైన వికృత మనస్తత్వం కలిగిన వ్యక్తులు చేసే దాడులను లౌకిక వాదులందరూ



ఖండించాలని పిలుపు నిచ్చారు. సిజెఐ పై జరిగిన దాడి విషయంలో కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ స్థలంలో వెలిసిన భవనాలను కూల్చివేయాలి : సీపీఐ

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :**బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ 191 సర్వే నెంబర్ ప్రభుత్వ స్థలంలో వెలసిన భవనాన్ని కూల్చివేసి స్థలం కాపాడాలని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ సోమవారం హైడ్రాకు ఫిర్యాదు చేశారు. సంతోష్ నాయక్ అనే వ్యక్తి 200 గజాల స్థలానికి 59 జీఓ కింద డబ్బులు చెల్లించి మరో రెండు వందల గజాల స్థలం కబ్జా పెట్టి భవన నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు బాచుపల్లి మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని అన్నారు. అలాగే నిజాంపేట్ ఇందిరమ్మ ఇండ్లు ఫేస్–3, 21, 22 బ్లాక్ ల వద్ద ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ బహుళ అంతస్తుల భవనాలను కూల్చి వేయాలని కోరారు. ఈ విషయమై పలుమార్లు స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిజాంపేట్ ప్రగతి నగర్ జగన్ స్టూడియో వద్ద అనుమతి లేని షెడ్లు నిర్మితమవుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని విన్నవించారు. కబ్జాలపై కఠిన




చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఆయన హైడ్రా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకుడు పొన్నికంటి దస్తగిరి పాల్గొన్నారు.

# వాల్మీకి జీవితం ఆదర్శప్రాయం



## - ఎల్ బి స్టేడియంలో ఘనంగా వాల్మీకి జయంతి

హైదరాబాద్, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :భారతీయ సాహిత్యంలో ఆదికావ్యం శ్రీమద్రామాయణం రచించి మానవ వికాసం కోసం కృషి చేసిన పరిపూర్ణ బ్రహ్మర్షి వాల్మీకి జీవితం ఆదర్శప్రాయమని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎల్ బి స్టేడియంలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ పుట్టుకతో ఎవరు మహనీయులు కారని, మనం అనుసరించే మార్గం ద్వారా ఉత్తమ స్థాయికి చేరుకోగలమని వాల్మీకి జీవిత చరిత్ర నిరూపించిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, అసిస్టెంట్ డైరెక్టర్లు కే.ఆర్ బట్టర్, కళ్యాణి, పిఆర్ఓ కాలేరు సురేష్, కోచ్ లు పాల్గొన్నారు

# సంపాదకీయం

## మోడీ తర్వాత ఎవరు...?

గడిచిన 11 ఏళ్లలో బీజేపీ దేశంలో గతంలో ఎన్నడూ లేనంతం బలంగా మారింది. దేశంలోని మెజారిటీ రాష్ట్రాల్లో సొంతంగా అధికారంలో ఉంది. మిత్రపక్షాల మద్దతుతో మరికొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. ఇక కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మూడోసారి మెజారిటీ రాకపోయినా.. అధికారం మాత్రం చేజిక్కించుకుంది. దీనికి కారణం మోదీ మేనియా.. ఇది ఎవరూ కాదనలేరు. మోదీ కారణంగానే బీజేపీ అనేక రాష్ట్రాల్లో అధికారం చేపట్టింది. కేంద్రంలో వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చి రికార్డు సృష్టించింది. అయితే ఆర్ఎస్ఎస్ 75 ఏళ్లు దాటినవారు రాజకీయాల్లో రిటైర్ కావాలంటోంది. మోదీకి సెప్టెంబర్‌తో 75 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈనేపథ్యంలో మోదీ తర్వాత ఎవరు అన్న చర్చ దేశవ్యాప్తంగా జరుగుతోంది. 75 ఏళ్లు తప్పనిసరి కాదని బీజేపీ అంటోంది. విపక్షాలు మాత్రం ఆర్ఎస్ఎస్ నిబంధనలు గుర్తు చేస్తున్నాయి. కౌటిల్యుడు చెప్పినట్లు, ఒక వ్యవస్థ బలంగా ఉండాలంటే, ఒక నాయకుడి అనుపస్థితిలోనూ అది సమర్థవంతంగా నడవాలి. ఈ విషయంలో బీజేపీ సిద్ధంగా ఉందా? విపక్షాల్లో మోదీకి సమానమైన నాయకుడు ఉన్నాడా?నరేంద్ర మోదీ దేశవ్యాప్త ఆకర్షణ, రాజకీయ వ్యూహం, జనసామాన్యంతో సంబంధం కలిగి ఉండే సామర్థ్యం వంటి లక్షణాలతో బీజేపీకి తిరుగులేని నాయకుడిగా నిలిచారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన నాయకత్వం బీజేపీకి అఖండ విజయాలను అందించింది. అయితే, బీజేపీలో మోదీ స్థాయి నాయకత్వాన్ని అందించగల నేతలు లేరనే వాదన బలంగా వినిపిస్తోంది. అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్, నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ వంటి నాయకులు ఉన్నప్పటికీ, వారెవరూ మోదీ జాతీయ ఆకర్షణ లేదా ఓటర్లను ఏకతాటిపైకి తీసుకురాగల సామర్థ్యం కలిగి లేరని విశ్లేషకులు భావిస్తున్నారు. అమిత్ షా రాజకీయ వ్యూహకర్తగా బలమైన నాయకుడు, కానీ మోదీ స్థాయి జనాదరణ లేదు. యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో బలమైన నాయకుడు, కానీ జాతీయ స్థాయిలో ఆయన ప్రభావం పరిమితం. నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ సీనియర్ నాయకులైనప్పటికీ, వారు జాతీయ నాయకత్వానికి అవసరమైన ఆకర్షణను ప్రదర్శించలేకపోతున్నారు. మోదీ నాయకత్వం బీజేపీని ఒక వ్యక్తి కేంద్రీకృత పార్టీగా మార్చిందని విమర్శకులు ఆరోపిస్తున్నారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే చెప్పినట్లు, "మోదీ లేకపోతే బీజేపీకి 150 సీట్లు కూడా రావు" అనే వ్యాఖ్య ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తుంది. బీజేపీ సంస్థాగత నిర్మాణం బలంగా ఉన్నప్పటికీ, మోదీ స్థాయి నాయకుడు లేకపోతే ఆ పార్టీ ఓటర్లను ఆకర్షించడంలో సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది.విపక్షాల్లోనూ మోదీకి సమానమైన జాతీయ నాయకుడు కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రొజెక్ట్ చేస్తున్నప్పటికీ, ఆయనకు కాంగ్రెస్ కూటమిలోనే పూర్తి మద్దతు లేదు. మమతా బెనర్జీ వంటి కీలక నాయకులు రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా అంగీకరించడానికి విముఖత చూపిస్తున్నారు. రాహుల్ గాంధీ తనను తాను బలమైన నాయకుడిగా నిరూపించుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శలు ఉన్నాయి. ఆయన ఆలోచనా విధానం, కుల?మత రాజకీయాలపై దృష్టి సారించడం వంటివి బీజేపీ వ్యూహాలకు ఎదురు నిలవలేకపోతున్నాయి. మోదీ కంటే మెరుగైన పాలన అందిస్తానని నిరూపించడంలో రాహుల్ వెనుకబడి ఉన్నారు. ఇక విపక్షాల్లో ఇతర నాయకుల విషయానికి వస్తే అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ లేదా ఇతర ప్రాంతీయ నాయకులు, జాతీయ స్థాయిలో మోదీకి సవాలు విసిరే స్థాయి ఆకర్షణ లేదా సంస్థాగత మద్దతు కలిగి లేరు. ఈ నేపథ్యంలో, మోదీ రిటైర్మెంట్ తీసుకున్నా, విపక్షాల నుంచి బలమైన ప్రత్యామ్నాయ నాయకత్వం లేకపోవడం దేశ రాజకీయాల్లో నాయకత్వ సంక్షోభాన్ని సూచిస్తోంది.బీజేపీలో 75 ఏళ్ల తర్వాత రిటైర్మెంట్ అనే అప్రకటిత నియమం గతంలో అద్వానీ, ఉమా భారతి, వెంకయ్య నాయుడి వంటి నాయకులపై వర్తింపజేయబడింది. అయితే, ఈ నియమం బీజేపీ రాజ్యాంగంలో లేదు. మోదీ రిటైర్మెంట్‌పై బీజేపీలో ఎటువంటి చర్చ జరగడం లేదు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన "75 ఏళ్లు దాటితే సేవలు చాలు" అనే వ్యాఖ్య విపక్షాల్లో చర్చను రేకెత్తించినప్పటికీ, బీజేపీ నుంచి ఎటువంటి స్పందన రాలేదు. రాజకీయ విశ్లేషకులు మోహిసినా కిద్వాయ్ చెప్పినట్లు, మోదీ స్వయంగా తప్పుకోకపోతే బీజేపీలో నాయకత్వ మార్పు చర్చకు రాదు. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో బలమైన నాయకత్వం అవసరమని ప్రజలు భావిస్తున్నారు. ఈ కారణంగా, మోదీ రిటైర్మెంట్ కోరుకునేవారు చాలా తక్కువ. ఎన్డీఏ మిత్రపక్షాలు, ముఖ్యంగా టీడీపీ, మోదీని సరైన సమయంలో ఉన్న సరైన నాయకుడిగా అభివర్ణిస్తున్నాయి.కౌటిల్యుడు చెప్పినట్లు, ఒక సంస్థ బలంగా ఉండాలంటే, ఒక నాయకుడి అనుపస్థితిలోనూ అది సమర్థవంతంగా నడవాలి. మోదీ ఈ విషయంలో విఫలమయ్యారని విమర్శలు ఉన్నాయి. ఆయన తన స్థాయి నాయకత్వాన్ని అందించగల వారసుడిని సిద్ధం చేయలేకపోయారని ఆరోపణలు ఉన్నాయి. బీజేపీలో ఇతర నాయకులు ఎదగకుండా చేయడం లేదా ఆ స్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించకపోవడం వల్ల మోదీ తర్వాత శూన్యత తలెత్తే అవకాశం ఉంది. ఇదే సమస్య విపక్షాల్లోనూ కనిపిస్తోంది, ఎందుకంటే వారు కూడా మోదీకి సమానమైన నాయకుడిని అందించలేకపోతున్నారు. 2029లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, నాయకత్వం ఒక కీలక అంశంగా మారే అవకాశం ఉంది. మోదీ తన రిటైర్మెంట్‌ను ప్రకటించకపోయినా, బీజేపీ తన స్థాయి నాయకత్వా న్ని సిద్ధం చేయడంలో విఫలమైతే, దాని రాజకీయ ఆధిపత్యం ప్రమాదంలో పడవచ్చు.అదే సమయంలో, విపక్షాలు కూడా బలమైన ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని అందించడంలో విఫలమైతే, దేశ రాజకీయాల్లో నాయకత్వ సంక్షోభం తీవ్రమవుతుంది.

# ప్రజాస్వామ్య రక్షణ కోసం ఓటు చోరీకి చెక్ పెట్టాలి

## - "ఓటు చోరీ అంటే ప్రజల భవిష్యత్తును చోరీ చేయడమే"

## - మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు






**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :** ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ దేశ



వ్యాప్తంగా "ఓటు చోరీ" నిరోధక కార్యక్రమాన్ని చేపట్టిందని మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని మీర్ పేట్ డివిజన్ జిల్లెలగూడలో "ఓటు చోరీ" పై మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ, మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళా కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భారత్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంగన్ గారి సుగుణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగలి సునీత రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జరుగుతున్న అక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ఓటు హక్కు విలువను తెలియజేయడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో ఇది చారిత్రక అడుగు అవుతుందని అన్నారు. "ప్రజల ఓటు హక్కు పవిత్రమైనదని, దానిని దొంగిలిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్రంలో అధికారంలో ఉన్న శక్తులు అధికార దుర్వినియోగంతో ప్రజల నిర్ణయాన్ని తిరగరాస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి అక్రమాలకు కాంగ్రెస్ పార్టీ ప్రజల మద్దతుతో ఎదుర్కొంటుందన్నారు. ఇందుకోసం బూత్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపులు, బోగస్ ఓటింగ్, డబ్బు%-%మద్యం పంపిణీ వంటి చర్యలపై నిఘా ఉంచాలని ఆమె సూచించారు. ప్రజలకు వారి హక్కులపై అవగాహన కల్పించడానికి అవసరమైతే మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. "ఓటు చోరీ అంటే ప్రజల భవిష్యత్తును చోరీ చేయడం వంటిదేనన్నారు. ప్రతి ఓటు విలువైనదని, మీ ఓటే మీ స్వరమని, దాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సునీతారావు అన్నారు. "ఓటు మా హక్కు %-% దాన్ని రక్షిద్దాం" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళల సంతకాలను విస్తృతంగా సేకరించారు. మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై "ఓటు చోరీ"పై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షురాలు సమత, అమృత, ప్రభావతి, కావ్య తదితర కాంగ్రెస్ మహిళా నాయకులు పాల్గొన్నారు.

# అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఆర్ టిఐ అవగాహన సదస్సులు నిర్వహించాలి

## - సమాచార హక్కుసాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్



**ఏఎస్ రావునగర్, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఆర్ టిఐ వారోత్సవాలలో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ కోరారు. సమాచార హక్కు చట్టం -2005 వారోత్సవాల్లో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి, విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా, డివిజన్, మండల, సర్కిల్, మున్సిపల్ స్థాయి కార్యాలయాల వారీగా అధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలోని ఏఏ కార్యాలయాల్లో ఎప్పుడు సదస్సులు నిర్వహిస్తారని సమాచారాన్ని ముందుగా ప్రజలకు తెలియజేయాలని కోరారు.

అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం ఈనెల 5వ తారీఖు నుండి 12వ తారీకు వరకు వారోత్సవాల సందర్భంగా సదస్సులు నిర్వహించాలని అనుకున్నప్పుడు 5వ తేదీ కంటే ముందే ప్రింట్ మీడియా అండ్ మీడియా ద్వారా సమాచారాన్ని ప్రజలకు తెలియజేసి ఉంటే బాగుండేదన్నారు. ఎనిమిది రోజుల వారోత్సవాలు భాగంగా ప్రస్తుతం మూడవరోజు పూర్తయిందని, మిగిలిన ఐదు రోజులలో జిల్లాలలో ఏ ఏ కార్యాలయాలలో సదస్సు నిర్వహిస్తున్నారో స్పష్టం చేయాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పష్టమైన వివరాలతో వారోత్సవాల సదస్సులు నిర్వహించాలని ఆయన కోరారు.

# బాచుపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన బాలానగర్ డిసిపి





**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 07, (తెలంగాణ దిశ) :**బాచుపల్లి పోలీస్ స్టేషన్ ను మంగళవారం బాలానగర్ జోన్ డిసిపి కె. సురేష్ కుమార్ వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ ప్రాంగణం మొత్తం పరిశీలించారు. ప్రభుత్వ ఆస్తులు, నేర ఆస్తులు, స్టేషన్ రికార్డులు, వివిధ కేసుల ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పిటిషనర్లతో సంభాషించి వారి అభిప్రాయాలను స్వీకరించారు. అనంతరం ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ను పరిశీలించి సిబ్బందితో సంభాషించారు. పోలీసుల సంక్షేమ భత్యాలను సమీక్షించారు.

# టూ టైర్ సిటీస్‌లో ఉగ్రజాడలు!



నిజామాబాద్, సెప్టెంబర్ 15,: భారతదేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు గతంలో పెద్ద నగరాల్లోనే పరిమితమై ఉండేవి. కానీ ఇటీవలి సంఘటనలు చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకూ ఈ ముప్పు విస్తరిస్తున్నట్లు సూచిస్తున్నాయి. ఇక పట్టుబడుతున్నవారిలో 30 ఏళ్లలోపు యువత ఉండడం మరింత ఆదోళన కలిగిస్తోంది. తాజాగా ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్, ఎన్ఐఏ, ఇంటలిజెన్స్ ఏజెన్సీలు సంయు క్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఇసిస్ (ఐఎస్ఐస్) లింక్స్‌తో ఉన్న ఐదుగురు యువకులు అరెస్టయ్యారు. ఈ మాడ్యూల్ ఢిల్లీలో బాంబు దాడులు, విధ్వంసకర కార్యకలాపాలు చేపట్టేందుకు సిద్ధమవుతుందని పోలీసులు వెల్లడి చేశారు. ఈ అరెస్టులు దేశవ్యాప్తంగా ఉగ్రవాద నెట్‌వర్క్‌ల వ్యాప్తిని, ముఖ్యంగా తెలంగాణ, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతా ల్లోని చిన్న పట్టణాలకూ విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది.తాజా ఆపరేషన్ ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్‌కు రహస్య సమాచారం ఆధారం గా ప్రారంభమైంది. ఢిల్లీ నుంచి ముంబై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు రాంచీలోని అషర్ దానిష్‌ను కలవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ఈ ఇద్దరు, ముంబైకు చెందిన అఫ్తాబ్ కురేషీ, సుఫియాన్ అబూబకర్ ఖాన్, ఢిల్లీ రైల్వే స్టేషన్ వద్ద అరెస్టయ్యారు. వీరి వద్ద సెమీ?ఆటో మేటిక్ పిస్తల్స్, 50 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, దేశీయ తుపాకీ, ఎయిర్ గన్ పట్టుకున్నారు. రాంచీలో దానిష్‌ను పట్టుకున్నప్పుడు అతని లాడ్జిలో బాంబు తయారీకి ఉపయోగపడే కెమికల్స్(సల్ఫ్యూరిక్ ఆసిడ్, నైట్రిక్ ఆసిడ్, సల్ఫర్ పౌడర్), కప్పర్ షీట్స్, స్టీల్ పైప్స్, సర్క్యూట్ బోర్డులు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్‌లు సేకరించారు. దానిష్, బుకారో (ఝార్ఖండ్) నివాసి, ఇంగ్లి?లష్ పోస్ట్ గ్రాజ్యుయేట్, 8 నెలలుగా రాంచీలో ఉంటూ 'గజ్వా లీడర్', 'సీఈఓ' అనే కోడ్ పేర్లతో మాడ్యూల్‌ను నడుపుతున్నాడు. అతను వాట్సాప్ గ్రూప్‌లలో తనను 'ప్రొఫెసర్'గా పరిచయం చేసుకుని, యువకులను రాడికలైజ్ చేస్తూ, పాకిస్తాన్ హ్యాండ్లర్స్‌తో సంప్రదింపులు జరిపేవాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన కమ్రాన్ ఖురేషీ, ఫండింగ్‌ను హ్యాండిల్ చేసేవాడు. మొత్తం ఐదుగురు అరెస్టులు: దానిష్, అఫ్తాబ్, సుఫియాన్, కమ్రాన్, తెలంగాణకు చెందిన మహ్మద్ యమాన్(బోధన్). వీళ్లంతా 26 ఏళ్లలోపు యువకులు. ఈ మాడ్యూల్ 'ప్రాజెక్ట్ ముస్తఫా' పేరుతో భారతదేశంలో ఖిలాఫత్ స్థాపించడానికి, బాంబు పేలుళ్లు, ఫిదాయీన్ దాడులు చేపట్టేందుకు సిద్ధమవుతుంది. ఐసిస్ ఆన్‌లైన్ రాడికలైజేషన్ ప్రోగ్రామ్‌ల ద్వారా యువకులను రిక్రూట్ చేస్తూ, ఢిల్లీలో ఆపరేషన్‌లు నిర్వహించేందుకు యత్నించారు.తెలంగాణలో ఈ మాడ్యూల్‌కు బోధన్ (నిజామాబాద్ జిల్లా) లింక్ బయటపడటం ఆశ్చర్యకరం.

# వాకింగ్‌లో ఎన్ని రకాలు ఉంటాయో తెలుసా..?



**మనకు అందుబాటులో ఉన్న అత్యంత సురక్షితమైన, అసలు ఖర్చు లేని వ్యాయామాల్లో వాకింగ్ ఒకటి. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎవరైనా సరే వాకింగ్ చేయవచ్చు. రోజూ 30 నిమిషాల పాటు వాకింగ్ చేయడం వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయి. అయితే వాస్తవానికి వాకింగ్‌లోనూ చాలా రకాలు ఉంటాయి. ఒక్కో రకమైన వాకింగ్ చేయడం వల్ల శరీరంలోని భిన్న అవయవాలకు భిన్నమైన ఫలితాలు కలుగుతాయి. అయితే ఎవరైనా సరే తమకు ఏ రకమైన వాకింగ్ సెట్ అవుతుందో దాన్ని చేయాల్సి ఉంటుంది. దీంతో ఎక్కువ ఫలితాన్ని పొందవచ్చు. ఇక వాకింగ్ లో ఎన్ని రకాలు ఉంటాయో, ఏ తరహా వాకింగ్‌తో ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.**


**బ్రిస్క్ వాకింగ్..:** వేగవంతమైన నడకను బ్రిస్క్ వాకింగ్ అంటారు. ఈ వాకింగ్‌లో చేతులను గట్టిగా ఊపుతూ గంటకు కనీసం 3 నుంచి 4 మైళ్ల వేగంతో వాకింగ్ చేయాల్సి ఉంటుంది. దీన్నే బ్రిస్క్ వాకింగ్‌గా చెబుతారు. ఈ తరహా వాకింగ్‌ను రోజూ 30 నిమిషాల పాటు చేస్తే బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. హృదయ సంబంధిత వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

అయితే ఈ వాకింగ్‌ను రోజూ చేయాల్సిన పనిలేదు. వారంలో కనీసం 5 సార్లు చేసినా చాలు, దీంతో ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. కొలెస్ట్రాల్, అధిక బరువు ఎక్కువగా ఉన్నవారు, షుగర్ ఉన్నవారు ఈ వ్యాయామం చేస్తే మంచిది. **పవర్ వాకింగ్..:** ఇక బ్రిస్క్ వాకింగ్‌నే ఇంకాస్త వేగంగా చేయాల్సి ఉంటుంది. అంటే గంటకు 5 మైళ్ల వేగంతో వాకింగ్ చేయాలన్నమాట. అలాగే చేతులను కూడా ఇంకాస్త వేగంగా ఊపాల్సి ఉంటుంది. దీన్నే పవర్ వాకింగ్ అంటారు. పవర్ వాకింగ్ వల్ల శరీరంలో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి పవర్ వాకింగ్ ఎంతగానో మేలు చేస్తుంది. త్వరగా బరువు తగ్గవచ్చు. శరీరంలోని కొవ్వు త్వరగా కరిగిపోతుంది. ఈ వ్యాయామాన్ని కూడా వారంలో 5 రోజుల పాటు చేస్తే సరిపోతుంది. 2 రోజులు విశ్రాంతి తీసుకోవచ్చు.

**ట్రెయిల్ వాకింగ్..:** ప్రకృతి కాసేపు వాకింగ్ చేస్తూ కాసేపు రెస్ట్ తీసుకోవడాన్ని ట్రెయిల్ వాకింగ్ అంటారు. దీని వల్ల శరీరానికి ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా మారుతాయి. శ్వాసకోశ సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. మైండ్ రిలాక్స్ అవుతుంది. ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఈ తరహా వాకింగ్‌ను రోజూ చేయవచ్చు. ఇక చిన్నపాటి పొడవైన స్టిక్స్ సహాయంతో నడవడాన్ని నోర్డిక్ వాకింగ్ అంటారు. దీని వల్ల శరీరంలోని పైభాగానికి కూడా సపోర్ట్ లభిస్తుంది. కండరాలు దృఢంగా మారుతాయి. వయస్సు మీద పడినవారు, బ్యాలెన్స్ సరిగ్గా లేనివారు లేదా సర్జరీలు అయిన వారు స్టిక్స్ సహాయంతో ఈ వాకింగ్ చేయవచ్చు. దీంతో త్వరగా కోలుకుంటారు.

**బ్యాక్ వార్డ్స్ వాకింగ్..:** సాధారణ వాకింగ్‌కు బదులుగా వెనక్కి కూడా నడవవచ్చు. దీన్నే బ్యాక్‌వార్డ్స్ వాకింగ్ అంటారు. దీని వల్ల శరీర భంగిమ సరిగ్గా ఉంటుంది. బ్యాలెన్స్ అదుపులోకి వస్తుంది. వెన్నెముక కండరాలు దృఢంగా మారి వెన్నుకు సపోర్ట్ లభిస్తుంది. వెన్ను నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే చెప్పుల్లేకుండా కూడా నడవవచ్చు. ఇలా ప్రకృతిలో పచ్చగడ్డి మీద నడవాల్సి ఉంటుంది. దీంతో అరికాళ్లలో ఉండే పలు నాడులకు భూమి ఆకర్షణ శక్తి లభిస్తుంది. దీంతో శరీరంలోని పలు నాడులు యాక్టివేట్ అవుతాయి. దీంతో పలు రకాల వ్యాధుల నుంచి బయట పడవచ్చు. ఇలా పలు రకాల వాకింగ్‌లలో మీకు కావల్సిన వాకింగ్‌ను చేసి దాంతో అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు.

# కోపాన్ని అదుపులో పెట్టుకోవాలి !



కోపాన్ని మనసు నుంచి తొలగించుకొనేందుకు మనిషికి నిరంతర సాధన చేయాలి. అలా చేస్తే శరీరం అదుపులోకి వస్తుంది. కోపం జయిస్తే ఇంద్రియాలను జయించవచ్చు. వసిష్ఠుడి మీద కోపంతో విశ్వామిత్రుడు ఘోర తపస్సు చేశాడు. పరమశివుడు ప్రత్యక్షం కాగా ధనుర్వేద రహస్యాలను బోధించమని కోరతాడు. శివుడు అంగీకరించి అన్ని అస్త్ర విద్యలను సిద్ధింప జేస్తాడు. ఆ అస్త్రాలను వసిష్ఠుడిపై ప్రయోగించగా ఆయన తన తపశ్శక్తితో వాటిని నిలువరిస్తాడు. క్షత్రియుడిగా ఉండి బ్రహ్మర్షిని జయించడం కష్టమని విశ్వామిత్రుడు తెలుసుకుంటాడు. బ్రహ్మర్షిగా మారడానికి దీర్ఘకాలం తపోదీక్ష వహిస్తాడు. బ్రహ్మ ప్రత్యక్షమై బ్రహ్మర్షిత్వాన్ని పొందావని చెప్పినా అతడిలో పూర్తిగా సంతోషం కలగదు. వసిష్ఠుడితో 'బ్రహ్మర్షీ!' అని పిలిపించుకోవాలని ఉందన్న కోరికను తెలియజేస్తాడు. వసిష్ఠుడు అలాగేనని పలుకుతాడు. అయితే ఆయన పూర్తిగా క్రోధాన్ని విడిచిపెట్టాడో లేదో తెలుసుకోవాలనే ఉద్దేశంతో విశ్వామిత్రుడు తనవద్దకు వస్తేనే బ్రహ్మర్షీ అని పిలుస్తానని చెబుతాడు. విశ్వామిత్రుడు వసిష్ఠుడి వద్దకు వెళ్లగా ఎందుకు వచ్చావంటూ ప్రశ్నించి దూరంగా పొమ్మంటాడు. ఆయన వెళ్లబోతుండగా మరలా రమ్మంటాడు. ఇలా పదేపదే చేసినా విశ్వామిత్రుడి ముఖంలో ప్రశాంతత చెదరకపోయేసరికి నిజంగానే బ్రహ్మర్షివయ్యావంటూ అభినందిస్తాడు. పతన హేతువైన క్రోధాన్ని గెలిచి చూడు, నువ్వే విశ్వామిత్రుడివవుతావు. అందుకే మనలో ఉన్న క్రోధాన్ని జయిస్తే..ప్రపంచాన్ని జయించడమే కాదు..భగవంతుడినీ జయించవచ్చు.

# పెంకితనం పోగొట్టాలంటే..

పిల్లలు ఒక్కోసారి చాలా మొండిగా వ్యవహరిస్తుంటారు. తాము అనుకున్నట్లే జరగాలని పట్టుబడతారు. తమకు నచ్చినట్లు జరగకపోతే తల్లిదండ్రులనే కాదు.. ఎవరినైనా లెక్కచేయరు. ఒక్కోసారి అనకూడని మాటలు కూడా అనేస్తుంటారు. ఇంకాస్త రెచ్చిపోయి అక్కడ ఏ వస్తువుంటే అది.. ఒకవేళ చేతిలో ఉన్నదైనా.. అది ఎంత విలువైనదైనా.. ఏమాత్రం ఆలోచించకుండా విసిరి కొడతారు. ఇంకొందరు తల్లిదండ్రులపై దాడి చేస్తారు. ఇలాంటి పిల్లల ప్రవర్తనతో ఒక్కోసారి తల్లిదండ్రులూ ఓర్పు వహించలేక రెండు తగిలిస్తారు. అయితే ఇలా చేస్తే వారిలో మార్పు రాకపోగా, వారి ప్రవర్తన మరింత దిగజారుతుందనేది నిపుణుల హెచ్చరిక. వారి వైఖరిలో మార్పు తేవడానికి ఏవిధంగా వ్యవహరించాలో నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. పిల్లలు జాలి, దయ, కరుణ, ఎదుటివారి పట్ల సానుభూతి, తోటివారి పట్ల సహానుభూతితో వ్యవహరించకపోతే.. వాటి గురించి చెప్పి, నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. వీటన్నింటికన్నా ముందు స్నేహంగా, ప్రేమగా మెలగడం, ఆప్యాయంగా పలకరించడం, అనురాగం కలిగి ఉండడం ఎంత అవసరమో వివరించాలి. అసలు చెప్పకుండా ఇవన్నీ వారి నుంచి ఆశించడం అత్యాశే అవుతుంది.

**కారణాలు గుర్తించాలి..:** పిల్లలు ఇలా పెంకిగా వ్యవహరించడానికి అసలు కారణాలు ఏమిటో తెలుసుకోవాలి. ఒక్కోసారి పిల్లలు వారిలోని బాధల్ని సరిగా వ్యక్తపరచలేకపోవడమే ప్రధానకారణం అంటున్నారు నిపుణులు. వారికి కలిగే బాధ, కష్టం తల్లిదండ్రులకు వ్యక్తపరచలేనప్పుడే పిల్లలు ఇలా మొండిగా వ్యవహరిస్తారని అంటున్నారు. అలాంటి సందర్భాల్లో తల్లిదండ్రుల బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది. పిల్లల బాధ ఏమిటో తల్లిదండ్రులే తరచి చూడాలి. ఇంకా చెప్పాలంటే తల్లిదండ్రులు కారణం ఏమిటో పరిశోధించాలి. అప్పుడే వాళ్లు ఏం చెప్పదలచుకున్నారో అర్థంచేసుకోవడానికి తల్లిదండ్రులే ప్రయత్నించాలని చెప్తున్నారు నిపుణులు.


**సభ్యమైన పదజాలం వాడేలా..:** పిల్లలు ఏదైనా కొత్త పదం వినగానే పదే పదే అదే రిపీట్ చేస్తుంటారు. అందుకే పిల్లల ముందు పెద్దలు జాగ్రత్తగా ఉండాలి. అదే సందర్భంలో పిల్లలు తోబుట్టువులతో,



తల్లిదండ్రులతో, బయటివారితో, పెద్దలతో, తోటి స్నేహితులతో, బంధువులతో ఎవరితో ఎలా మాట్లాడాలో చెప్పాలి. ఎలాంటి పదజాలం ఉపయోగించాలి అనేది నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అంటున్నారు నిపుణులు. మాట్లాడే విధానంతోనే తన పట్ల ఎలాంటి గౌరవం ఏర్పడుతుందో, ఇవన్నీ వారి భావోద్వేగాలనుమెరుగైనపద్ధతిలో వ్యక్తీక రించడానికి తోడ్పడుతుంది. అంతేకాదు తమని తాము తీర్చిదిద్దు కోవడానికి, ప్రవర్తనపరమైన లోపాలు సరిజేసేందుకు ఉపయోగపడు తుంది. జాలి, దయ వంటి సుగుణాలు కూడా అలవడు తాయని చెప్తున్నారు నిపుణులు. కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పిల్లల్లో మెరుగుప డతాయి. దీనివల్ల వారి భవిష్యత్తుకు మెరుగైన మార్గం ఏర్పడినట్లే. మంచి పదాలను నేర్పించడం వల్ల, వాళ్లు వాటిని ప్రాక్టీస్ చేయడం వల్ల వారి పట్ల వారికే నమ్మకం కలుగుతుందని అంటున్నారు.

**ప్రశంసించాలి..:** పిల్లలు తమ ప్రవర్తనను మార్చుకుంటున్నప్పుడు చిన్న అభినందన కొండంత ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఇలా చేయడం వల్ల వారిని మరింత బలంగా మార్పు వైపు ప్రోత్సహించినట్లే అంటున్నారు నిపుణులు. పిల్లలకు ప్రశంస అనేది బూస్ట్ లాంటిది. పిల్లలు తల్లిదండ్రులు ప్రోత్సహించాలనే ఎక్కువగా కోరుకుంటారు. అందుకే ఎలాంటి పనులు చేస్తే మీ నుంచి అభినందనలు వస్తాయో పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. దానివల్ల వారు అలాగే నడుచుకుంటూ తల్లిదండ్రుల నుంచి బోలెడు అభినందనలు పొందుతారు. పిల్లల్ని ప్రోత్సహించి, మంచి ప్రవర్తన కలవారిగా తయారుచేయండి అంటున్నారు నిపుణులు. దీనివల్ల పిల్లల్లో మొండితనం అనేదే కనపడదని చెప్తున్నారు.

# వట్టి వేరు.. ఉపయోగాలు వేర్వేరు..





సాధారణంగా ఎండాకాలంలో ఇల్లు చల్లదనం కోసం వట్టి వేళ్లతో చేసిన చాపలు వాడుతుంటారు. కొబ్బరి నూనెలో వేసుకుని కూడా కొంతమంది ఉపయోగిస్తుంటారు. వీటిని ఆహారంలో కూడా భాగం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఈ వేర్లలో ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటిని ఎక్కువగా ఔషధాల్లో వాడతారని వైద్యులు చెబుతున్నారు. వట్టివేరుతో షర్బత్ తయారుచేసుకుని తాగడం వల్ల ఎండాకాలం తరచూ వచ్చే కడుపు నొప్పి, మలబద్ధకం, తలనొప్పి తగ్గుతాయి. నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. మెదడుకి రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది.వట్టివేరు సారం శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. సువాసన భరితంగా ఉండడం వల్ల ఒత్తిడి కూడా దూరమవుతుంది.నిద్రలేమిని పోగొట్టి జీర్ణ సమస్యలని దూరం చేస్తుంది..తలనొప్పితో బాధపడుతుంటే ఈ వేర్లని నీటిలో నానబెట్టి ఆ నీటిని తాగొచ్చు. వేర్లని మెత్తని పేస్టులా నూరి దానిని తలపై పట్టిలా వేసుకుని కాసేపయ్యాక శుభ్రం చేసుకున్నా తలనొప్పి తగ్గిపోతుంది. వేర్లని ఓ గ్లాసులో వేసి ఓ నాలుగైదు గంటలు లేదా రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తాగాలి. దీని వల్ల డీహైడ్రేషన్ సమస్య దూరమవుతుంది. కుండనీళ్లు వాడేవారు ఈ వట్టివేరుని ఓ తెల్లని వస్త్రంలో మూట కట్టి ఆ నీటిలో వేయాలి. రెండు, మూడ్రోజులకి ఓసారి వట్టివేరును మార్చుకోవాలి. కుండ నీటిలో నానబెట్టిన వట్టివేర్లని పారేయకుండా దానిని మెత్తగా నూరుకొని ప్యాక్‌లా ముఖానికి వేసుకోవచ్చు. దీంతో ముఖంపై ఉన్న మచ్చలు, మొటిమలు దూరమవుతాయి. వట్టివేర్లని నీటిలో వేసి మరిగించి స్నానానికి వాడే నీటిలో కలిపి స్నానం చేస్తే చెమట వాసన దూరమవుతుంది.

# చెమటకాయలు పోవాలంటే..



వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే అతి ముఖ్యమైన సమస్యల్లో చెమటకాయలు ఒకటి. వీటి కారణంగా చర్మం దురద పెట్టటమే కాకుండా మృదుత్వాన్నికోల్పోతుంది. కొన్ని సహజసిద్ధమైన చిట్కాలను పాటిస్తే చాలా సులభంగా చెమటకాయల నుంచి బయట పడొచ్చు.

పెరుగు : చెమట కాయలు ఉన్న ప్రదేశంలో చల్లని పెరుగుని అప్లై చేసి 15 నిమిషాలు ఉంచాలి. తరువాత చల్లని నీటితో కడిగేసి మెత్తటి బట్టతో అద్దాలి.పెరుగులో సహజంగాఉండేయాంటీ బ్యాక్టీరియల్,యాంటీ ఫంగల్ ప్రాపర్టీస్ చెమటకాయలు రాకుండా చేస్తాయి.రోజ్ వాటర్ : 200 ఎంఎల్ రోజ్ వాటర్‌లో నాలుగు టేబుల్ స్పూన్ల తేనె, 200 ఎంఎల్ ప్యూర్ వాటర్ కలపాలి. బాగా కలిపి ఐస్ ట్రేలో పోసి ఫ్రీజ్ చేయాలి. ఇవి క్యూబ్స్‌లా అయ్యాక నాలుగైదు క్యూబ్స్ తీసుకుని పల్చని మస్లిన్ బట్టలో చుట్టి చెమట కాయలు ఉన్న ప్రదేశంలో మృదువుగా అద్దాలి. రోజ్ వాటర్ చర్మం పీహెచ్ బ్యాలెన్స్‌ని మెయింటెయిన్ చేస్తుంది. ఎక్కువగా ప్రొడ్యూస్ అయ్యే ఆయిల్‌ని కంట్రోల్ చేస్తుంది.

గంధం : గంధానికి చల్లని ఫుల్ ఫ్యాట్ మిల్క్ కలిపి ఆ మిశ్రమాన్ని చెమట కాయలు ఉన్న ప్రదేశంలో పట్టించి గాలికి ఆరనివ్వాలి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేయాలి.

ముల్తానీ మిట్టి : మూడు టేబుల్ స్పూన్ల ముల్తానీ మిట్టిలో రెండు టీ స్పూన్ల పుదీనా పేస్ట్ కలిపి తగినన్ని చల్లని పాలు పోసి స్మూత్ పేస్ట్ తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని చర్మం మీద అప్లై చేసి గాలికి ఆరనివ్వాలి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేయాలి.

కలబంద : చెమటకాయలు ఉన్న ప్రదేశంలో కొంచెం కలబంద గుజ్జు రాస్తే త్వరగా తగ్గిపోతాయి. కలబందలో ఆస్ట్రిజెంట్ లక్షణాలు ఉండటం వలన చెమటకాయలు త్వరగా తగ్గటానికి సహాయపడతాయి. చర్మంపై ఉండే ఇన్‌ఫెక్షన్లను కూడా తగ్గిస్తుంది.

టీ ట్రీ ఆయిల్ : టీ ట్రీ ఆయిల్‌లో యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు సమృద్ధిగా ఉంటాయి .కొంచెం టీ ట్రీ ఆయిల్‌ను తీసుకుని దానికి కొంచెం నీటిని కలిపి మిశ్రమంగా తయారు చేయాలి. ఆ మిశ్రమంలో కాటన్ బాల్‌ను ముంచి చర్మంపై రాస్తే చెమట కాయలు చాలా త్వరగా తగ్గిపోతాయి.

వెనిగర్ : టిష్యూ పేపర్‌ను తీసుకుని వెనిగర్‌లో ముంచి చెమట కాయలు ఉన్న ప్రదేశంలో అద్దాలి. ఇలా చేస్తే చెమట కాయలు త్వరగా తగ్గిపోతాయి. లవంగ నూనె : కాటన్ బాల్‌ను తీసుకుని లవంగ నూనెలో ముంచి చెమటకాయలు ఉన్న ప్రదేశంలో రాస్తే చెమట కాయలు తగ్గుముఖం పడతాయి. తరచూ ఇలా చేయడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.

# హైడ్రేటెడ్‌గా ఉంటేనే.. అందం!

వేసవి వేడి.. మీ చర్మం తేమను కోల్పోయేలా చేస్తుంది. చర్మం పొడిబారి.. అందం బీటలు వారుతుంది. అంతేకాదు.. సూర్యుడి హానికరమైన యూవీ కిరణాలు.. చర్మంలో మెలనిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. తద్వారా చర్మం రంగు మారడంతోపాటు ముఖంపై నల్ల మచ్చలూ ఇబ్బంది పెడుతాయి. వీటినుంచి బయట పడాలంటే.. ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే!

చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి పుష్కలంగా నీరు తాగాలి. రోజుకు కనీసం 8-10 గ్లాసులైనా తీసుకోవాలి. దీనివల్ల శరీరం నుంచి టాక్సిన్స్ బయటికి వెళ్లిపోతాయి. చర్మం లోపలి నుంచి హైడ్రేటెడ్‌గా మారుతుంది. నీటిశాతం అధికంగా ఉండే దోసకాయలు, పుచ్చకాయ, నారింజ, స్ట్రాబెర్రీలను ఎక్కువగా తీసుకోండి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా.. చర్మానికి అవసరమైన పోషకాలను కూడా అందిస్తాయి. ఆహారంలో యాంటి ఆక్సిడెంట్స్, విటమిన్ సి ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవి యూవీ కిరణాల నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తాయి. విటమిన్ సి.. శరీరంలో ఫ్రీరాడికల్స్‌తోపాటు మెలనిన్ ఉత్పత్తిని నిరోధిస్తుంది. నల్లమచ్చలు రాకుండా కాపాడుతుంది. ఇక ఎక్కువ సమయం పాటు ఏసీ గదుల్లో ఉన్నా.. చర్మం పొడిబారుతుంది. ఏసీల నుంచి వచ్చే పొడిగాలి.. చర్మంలో తేమను తొలగిస్తుంది. కాబట్టి, ఇంట్లో, కార్యాలయాల్లో హ్యూమిడిఫయర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఇవి గాలికి తేమను అందించి.. చర్మం ఎక్కువ పొడిగా మారకుండా నిరోధిస్తాయి.చర్మ సంరక్షణ కోసం కలబంద వంటి హైడ్రేటింగ్



పదార్థాలను కలిగిన మాయిశ్చరైజర్లు వాడాలి. ఇవి చర్మం తేమను కోల్పోకుండా కాపాడతాయి. చర్మాన్ని మృదువుగా మార్చడంలో సహాయపడతాయి.వేసవిలోనే కాదు.. ఏడాదంతా సన్‌స్క్రీన్ లోషన్ వాడటం మంచిది. ఇది హైపర్‌పిగ్మెంటేషన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తుంది. రసాయనాలు తక్కువగా ఉండే ఉత్పత్తులను ఎంచుకోండి. ఇక వేసవిలో ప్రతి రెండుమూడు గంటలకు ఒకసారి సన్‌స్క్రీన్ లోషన్‌ను అప్లయి చేస్తూ ఉండాలి.

# ఆహారం.. అనుబంధం..!



మనదేశంలో ఆహారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. భోజనంగానే కాకుండా.. ఆచార వ్యవహారాలు, మత విశ్వాసాల్లోనూ ఆహారం కీలకంగా కనిపిస్తుంది. విలువలు, సంస్కృతి, సౌకర్యంతోపాటు గుర్తింపును కూడా ప్రతిబింబిస్తుంది. అయితే, అదే ఆహారం.. 'జెనరేషన్ జెడ్' దంపతుల మధ్య గొడవలకు కారణం అవుతున్నది. బంధాలను విచ్ఛిన్నం చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా.. వెగన్‌లు, శాకాహారులు, మాంసాహారులు ఉంటారు. కానీ, మనదేశంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఇక్కడ శాకాహారులైనా.. కొందరు కోడిగుడ్లతో చేసిన కేక్‌ను ఇష్టంగా తింటారు. మరికొందరు మాంసాహారులు.. కొన్ని ప్రత్యేక రోజుల్లో మాంసాన్ని దూరం పెడుతారు. అప్పుడప్పుడూ మాంసం తినడం, కొన్నిరకాల పదార్థాలనే తీసుకోవడం లాంటివాళ్లూ ఇక్కడ కనిపిస్తారు. అయితే, ఇలాంటి విభిన్నమైన ఆహారపు అలవాట్లు.. 'జనరేషన్ జెడ్' దంపతుల మధ్య గొడవలు సృష్టిస్తున్నాయట. దంపతుల్లోఒకరు శాకాహారి.. మరొకరు మాంసాహారి అయినప్పుడు.. ఇబ్బంది కలుగుతున్నదట. దాంతో ఒకే ఇంట్లో ప్రతిరోజూ రెండు వేర్వేరు వంటకాలను సిద్ధం చేయాల్సి వస్తున్నది. గృహిణులు సర్దుకుపోతున్నా.. ఉద్యోగాలు చేసేవారు అవస్థ పడుతున్నారు. ఇక ఉమ్మడి కుటుంబమైతే.. ఈ వంటల జాబితా మరింత పెరుగుతున్నది. అంతేకాకుండా.. తాము కోరుకున్న ఆహారం తినలేకపోతున్నామని కూడా నవతరం ఇల్లాళ్లు చెబుతున్నారు. అదే సమయంలో పెద్దవాళ్లు ఈ ఆహారపు గొడవలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ఇదేం పెద్ద విషయం కాదని కొట్టిపారేస్తున్నారు. ఆహారం విషయంలో సర్దుబాటు చేసుకోవడానికి ఈ తరం ఇష్టపడటం లేదని చెబుతున్నారు.

**బంధాలపై ప్రభావం..:** 'జెన్-జీ' దంపతులు ఇలా ఆహారం విషయంలో రాజీపడటం, గొడవపడటం.. వారి బంధాలపై ప్రతికూ ల ప్రభావం చూపుతుందని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంటి భోజనం విషయంలోనే కాదు.. విందులు, రెస్టారెంట్లకు వెళ్లినప్పుడు, ఇంటి సామగ్రి కొనుగోలు విషయాల్లోనూ తగాదాలకు దారితీయవచ్చని అంటున్నారు. అయితే, ఒకరి ఇష్టాలను గౌరవించ డం, కలిసి తినడం లాంటి చిన్న విషయాలే.. వారిలో భావోద్వేగ సంబంధాన్ని మెరుగుపరుస్తాయని చెబుతున్నారు.

అందుకే.. ఒకరి అభిరుచులకు మరొకరు విలువ ఇచ్చి, మధ్యేమార్గాన్ని ఫాలో అయిపోతే.. ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కావని సూచిస్తున్నారు. ఇలాంటి దంపతుల్లో భోజనం దాటవేయడం, అసమతుల్య ఆహారం తీసుకోవడం కనిపిస్తున్నదట. ఇది వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదట. అందుకే.. ఆహార వ్యత్యాసాల విషయంలో ఎదుటివారి భావోద్వేగాలను, ఆహారపు అలవాట్లను గౌరవించాలని చెబుతున్నారు. ఒకరినొకరు మార్చుకోవడానికి ప్రయత్నించకుండా.. ఇద్దరి అభిరుచులకూ డైనింగ్ టేబుల్‌పై చోటు కల్పించాలని సూచిస్తున్నారు. మధ్యేమార్గంగా ఇద్దరూ ఇష్టపడే ఉమ్మడి ఆహార వ్యవహారాలను సృష్టించుకోవాలని చెబుతున్నారు. అదే సమయంలో వంటలకు ఒక్కరినే బాధ్యులుగా చేయకుండా.. కలిసి వంట చేయడం ద్వారా భాగస్వామిపై భారం తగ్గడంతోపాటు ఇద్దరి మధ్యా బంధం మరింత బలపడుతుందని సలహా ఇస్తున్నారు.

## అనాథాశ్రమ స్థలాన్ని కాపాడండి



**రాప్తాడు,తెలంగాణ దిశ :** పంచాయతీ పరిధిలోని ముస్లిం మైనార్టీ కాలనీలో అనాథాశ్రమం (ఆల్ ఫైగా- మే గరీబ్ నవాజ్ మదర్సా) కబ్జా కాకుండా కాపాడాలని కాలనీ వాసులు మున్నా, అబ్దుల్ రహీమ్, మహబుబ్ బాషా, ఇబ్రహీం, ఇర్షాద్, మహమ్మద్‌బాషా, షేక్షావలి కోరారు. వారు మాట్లాడుతూ 2005లో 119 సర్వే నంబర్‌లో అప్పటి ప్రభుత్వం ము స్లిం మైనార్టీ 117 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. కాలనీలో స్థానికుల సంక్షేమం కోసం మసీదు, పాఠశాల, అంగనవాడీ కేంద్రం, అనాథాశ్రమం నిర్మించుకునేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించిందన్నారు. అనాథాశ్రమం కోసం 21 సెంట్లు కేటాయించింది. దీని నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడం తో స్థలం ఖాళీగా ఉందన్నారు. ఆ స్థలాన్ని మైనార్టీ కాలనీలో నివాసం ఉంటున్న ఖాజీ పీరా, అమానుల్లా అనే వ్యక్తులు నకిలీ ఇంటి పట్టాలు సృష్టించి ఇతరులకు విక్రయిస్తున్నారన్నారు. ఆ స్థలంలో సరిహద్దు రాళ్లు పాతేం దుకు సిద్ధమవుతున్నారన్నారు. స్థలాన్ని కాపాడాలని రాప్తాడు తహసీల్దా ర్‌కు, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్ర మంలో అందచేశామన్నారు. రెవెన్యూ అధికారులు అనాథాశ్రమ స్థలం కాబ్జా కాకుండా కాపాడాలని కోరారు.

## కొలువుల గ్రంథాలయం...

**సూర్యాపేట,తెలంగాణ దిశ :** సూర్యాపేట జిల్లాకేంద్ర గ్రంథాలయం కొలువులకు నిలయంగా మారింది. వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండటంతో అభ్యర్థుల సన్నద్ధతకు ఉపయోగపడుతోంది. పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి అభ్యర్థులు వచ్చి చదువుకొని ఉద్యోగాలు సాధిస్తున్నారు. 400 మందికిపై సభ్యత్వాలు పొందగా.. రోజూ 300 పైగా యువకులు, విద్యార్థులు వస్తుంటారు. విశాలమైన గదులతోపాటు, అన్ని రకాల వసతులు, వివిధ దినపత్రికలను అధికారులు సమ కూర్చుతున్నారు. ఈ గ్రంథాలయంలో 28 వేలకుపైగా పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ చదువుకున్న వారిలో చాలామంది పోలీసు, ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికవడం విశేషం. సూర్యాపేట గ్రంథాలయానికి వచ్చి చదువుకున్న వారిలో ఇటీవల వెల్లడైన డీఎస్సీ ఫలితాల్లో 25 మంది ఉద్యోగాలు సాధించారు. కొంతమంది మహి ళలకు వివాహాలు జరిగినా భర్తల ప్రోత్సాహంతో రోజూ వచ్చి చదు వుకొని తమ కొలువు కలను నెరవేర్చుకున్నారు.



మాది నిరుపేద కుటుంబం. పెయింటింగ్ పని చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. మా నాన్న మరణంతో మా కుటుంబం దిక్కుతోచని స్థితిలోకి చేరుకుంది. క్రీడలపై మక్కువతో బీపీఈడీ, ఎంపీఈడీ పూర్తి చేసి 2017లో డీఎస్సీ పరీక్ష రాశాను. కొన్ని మార్కుల తేడాతోఉద్యోగం కోల్పోయాను. రోజూ పది గంటలు సూర్యాపేట గ్రంథాల యంలో చదువుకొని ఉద్యోగం సాధిం చాను. సూర్యాపేట మండలం సోలిపేటవిధుల్లో చేరాను. మా అక్క ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. ఆమె స్ఫూర్తితో ఎలాగైనా ఉపాధ్యాయ కొలువు సాధించాలనే పట్టుదలతో సూర్యాపేట గ్రంథాలయానికి వచ్చి చదువుకున్నా. ఇక్కడ మాకు కావాల్సిన పుస్తకాలు ఉన్నాయి. వాటిని రెండు నెలలుగా చదవడంతో ఉద్యోగం వచ్చేందుకు దోహదపడింది. కోదాడ మండలం గణపవరం ఎంపీపీఎస్ పాఠశాలలో విధుల్లో చేరాను.

## విద్యుత బిల్లు చెల్లింపునకు వినియోగదారుల పాట్లు..!

**అనంతపురం,తెలంగాణ దిశ :** విద్యుత బిల్లుల చెల్లించేందుకు వినియోగదారులు ఇబ్బం దులు పడుతున్నారు. బిల్లులు చెల్లింపునకు ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్ వల్ల ఉపయోగం లేకుండా పోయింది. డిస్కం వెబ్‌సెట్ ద్వారా చెల్లింపులకు సర్వర్ కష్టాలు తలెత్తుతున్నాయి. వినియోగదారులకు కనీస అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు. దీనికితోడు ప్రస్తుతం జరుగుతున్న ఆనలైన మోసాలకు మరింత వినియోగదారులకు భయపడిపోతున్నారు. ఈక్రమంలోనే విద్యుత బిల్లులు చెల్లించేందుకు విద్యుత బిల్లులు చెల్లింపు కేంద్రాలకు క్యూకడుతున్నారు. కాగా ఈ ప్రభావం విద్యుత బిల్లులు వసూళ్లపై పడుతోంది. ఇందుకు ఈనెలలో ఇప్పటి వరకు వసూలైన కలెక్షన్సే నిదర్శనం. గత నెల 22(జూన)కి రూ. 64.54కోట్లు వసూలైం ది. ఈనెలలో రూ. 44.93కోట్లు మాత్రమే వసూలైంది. ఇప్పటి వరకుదాదాపు రూ. 20కోట్ల మేర ఈనెల విద్యుత బిల్లుల చెల్లి ంపులు తగ్గిపోయాయి. ఈనెల మొదటి నుంచి ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు ఫోనపే, గూగుల్‌పే, పేటిఎం, ఇతర యూపీఐ యాప్‌ల నుంచి విద్యుత బిల్లుల చెల్లింపులను ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ నిలిపేసింది. కేవలంసంస్థ కస్టమర్ యాప్, డిస్కం వెబ్‌సైట్ నుంచి బిల్లులు చెల్లిం చాలని సంస్థ సూచించింది. ఈక్రమంలోనే విద్యుత బిల్లులు చెల్లింపు కేంద్రాలవద్ద కస్టమర్‌యాప్ క్యూఆర్‌కోడ్‌లను ఏర్పాటు చేశారు. అయితే వాటివలన వినియోగదారులకు ఏమాత్రం ప్రయోజనం కలగడం లేదు. వినియోగదారులు క్యూఆర్ కోడ్ స్కాన చేసినా బిల్లు





చెల్లింపు ప్రక్రియ ఓపెన కావడం లేదు. అలాగే వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులకు ప్రయత్నిం చినా ఉపయోగం లేకుండా పోయింది. వెబ్‌సైట్ ద్వారా అన్ని వివరాలు నమోదు చేసి, సబ్మిట్ కొట్టిన తరువాత యూపీఐఅడుగుతోంది. అక్కడ ఫోనపే,గూగుల్ పే వంటి వాటి ద్వారా చెల్లించేందుకు వినియో గదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రక్రియ మొత్తం పూర్తి అయి అమౌంట్ కూడా చెల్లిస్తున్నారు. ఆతరువాత నాలుగు నిమిషాల టైంలిమిట్ పడుతోంది. ఆతరువాతైనా బిల్లు చెల్లింపు పూర్తి అవుతుందా అంటే లేదు. సర్వర్ సమస్యతో పేమెంట్ అన సక్సెస్‌అని చూపుతోంది. పలుమార్లు ఇదేవిధంగా వినియోగదారులు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఫోనపే, గూగుల్‌పే, ఇతరవాటి ద్వారా బిల్లులు చెల్లింపులకు అలవాటుపడిన వినియోగదారులు కొత్త విధానంతో ఇబ్బందులు పడుతున్నారు.

## ఉత్పత్తి వ్యయం.. సింగరేణిపై భారం..!



**భూపాలపల్లి,తెలంగాణ దిశ :** రవాణాకు సిద్ధంగా సింగరేణి బొగ్గు సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి వ్యయం రోజురోజుకు పెరుగుతోంది.. కోల్ ఇండియా సంస్థలైన మహానది కోల్‌ఫీల్డ్స్(ఒడిశా), వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్(మహారాష్ట్ర) కన్నా సింగరేణి సంస్థలో ఉత్పత్తిచేసే బొగ్గు ధర అధి కంగా ఉంటోంది. రవాణా ఛార్జీల భారం కారణంగా రాష్ట్రంతో పాటు పలు దక్షిణాది విద్యుత్తు సంస్థలు సింగరేణి పైనే ఆధారపడుతున్నాయి. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోకుంటే భవిష్యత్తులో సింగరేణి మనుగడపై ప్రభావం పడొచ్చనే అభిప్రాయం సంబంధిత అధికారవర్గాల్లో వ్యక్తమ వుతోంది. దీంతో పాటు గనుల్లోకి త్వరలో ప్రైవేటు సంస్థలు ప్రవేశించనున్న తరుణంలో సింగరేణికి మరింత పోటీ ఎదురుకానుంది. వచ్చే ఐదారేళ్లలో ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోక తప్పదనే వాదన వినిపిస్తోంది.. ప్రస్తుతం ఈ అంశం అన్ని కోల్‌బెల్ట్ ఏరియాల్లో చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు బొగ్గు బ్లాకులను కట్టబెట్టే అంశం కార్మికుల అభద్రతాభావానికి కారణమవుతోంది. ఈ క్రమంలోనే అన్ని కోల్ బెల్ట్ ఏరియాల్లో కార్మికులు, అధికారులు నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని ఇటీవల సింగరేణి ఎండీ బలరాం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఓసీపీ గనుల్లో అధిక బొగ్గు ఉత్పత్తి కోసం భూసేకరణ పనులను అధికారులు వేగవంతం చేశారు. ఇంత వరకు భూగర్భ, ఉపరితల గనుల్లో బొగ్గును నిర్ణీత మొత్తానికి వెలికితీసే పనులకు పరిమితమైన ప్రైవేటు కంపెనీలు.. ఇకపై ఏకంగా వేలంలో బొగ్గు బ్లాకులనే సొంతం చేసుకుంటున్నాయి. ఏడేళ్ల క్రితం భూపాలపల్లి డివిజన్‌లోని తాడిచర్ల బొగ్గు బ్లాక్‌ను కేంద్రం ఓ ప్రైవేటు సంస్థకు కేటాయించడంతో కార్మికుల్లో పెద్దఎత్తున ఆందోళన వ్యక్తమైంది. దీంతో ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకుని ఆ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించింది. కానీ, సింగరేణి ప్రాంతాల్లోనూ బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రెండేళ్లుగా చేపట్టడంతో ప్రైవేటు సంస్థలు వాటిని పొందే అవకాశం ఏర్పడింది. ఈ మేరకు సింగరేణి ప్రాంతంలోనే బయట కంపెనీలు పోటాపోటీగా బొగ్గు ఉత్పత్తి చేసి సింగరేణి కన్నా తక్కువ ధరకే విక్రయించే అవకాశం ఉంది.

## అడిగినంత చెల్లిస్తేనే సంతకం.. లేదంటే వాయిదానే..!



సంతనూతలపాడు: సంతనూతలపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోంది. అడిగినంత ఇస్తే కాని ఇళ్లు, స్థలాలు రిజిస్ట్రేషన్ కావడం లేదు. ప్రైవేట్ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లదే అక్కడ హవా. వారి ద్వారా ముడుపులు పుచ్చుకుంటున్న అధికారులకు ఎంత తిన్నా దాహం తీరడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా ఏదో ఒక తిరకాసు పెడుతూనే ఉంటారు. ఆ పేరుతో రూ. 15వేల నుంచి రూ. 50వేల వరకూ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విలువ ఎక్కువగా ఉన్న భూముల రిజిస్ట్రేషన్లకైతే ఏకంగా రూ. లక్షకుపైగానే తీసుకుంటున్నారు. భూముల విలువ ఎక్కువగా ఉండి ఏదైనా సమస్య ఉంటే అన్నీ తాము చూసుకుని సరి చేస్తాం,అడిగినంత ఇస్తే చాలు అని కార్యాలయ సిబ్బంది మధ్య వర్తుల ద్వారా పెద్దమొత్తాల్లో వసూలు చేస్తున్నారు.

ఇవ్వకపోతే రిజిస్టర్ అయిన డాక్యుమెంట్ తీసుకునే దాకా తంటాలు పడాల్సివస్తోంది. ఎస్ఎన్‌పాడుసబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది కొంతమందిని ఏజెంట్లుగా ఏర్పాటు చేసుకున్నారు. వారి ద్వారా దందా సాగిస్తున్నారని పెద్దఎత్తున విమర్శలు ఉన్నాయి. గతంలో పలుమార్లు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంపై ఉన్నతాధికారులకు, ఏసీబీకి ఫిర్యాదు చేసినట్లు సమా చారం. కానీ కార్యాలయంలో పనిచేసే ముఖ్యఅధికారి జిల్లాలోని ఎటువంటి అధికారులనైనా తన మేనేజ్ చేయగలడన్న పేరుంది. దీంతో కార్యాలయంపై చేసిన ఫిర్యాదులు అటకెక్కుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫిర్యాదు చేసినా ఉపయోగం లేనప్పుడు అడిగినంత సమర్పించుకుని సర్దుకుంటే మంచిదన్న అభిప్రాయానికి ప్రజలు వస్తున్నారు. జిల్లాకేంద్రానికి కూతవేటు దూరంలో ఉండటంతో నిషేధిత భూముల సర్వే నెంబర్లను సబ్ డివిజన్‌గా చూపి ప్రైవేటు భూములుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా వ్యవహారాల్లో కార్యాలయ సిబ్బంది, కొంతమంది కబ్జాదారులకు అండగా ఉంటూ జేబులు నింపుకొంటున్నారని సమాచారం.

అసలుఎలాంటి రిస్క్ లేకుండా పేపర్ వర్క్ అయిపోవాలంటే మధ్యవర్తులను సంప్రదిం చాల్సిందే. ప్రతిపనికీ రేటు ఫిక్స్ చేసి మరీ కార్యాలయ అధికారులు మధ్యవర్తులను నియమించుకుని అడ్డగోలుగా దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొత్తంగా ఎస్ఎన్‌పాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి మూడు లంచాలు, ఆరు అక్రమాలుగా వర్ధిల్లుతోంది. కార్యాలయంలో వివిధ సేవలకు సమయపాలన పాటించ కపోవడం గమనార్హం. భూముల దస్తావేజులు,ఇతర రిజిస్ట్రేషన్‌లు, ఈసీలు, నకలు, పెండింగ్ డాక్యుమెంట్లు, మార్కెట్ విలువ వంటి వాటికి సంబంధించి నిర్దేశిత సమయాన్ని సిటిజన్ చార్ట్‌లో పేర్కొన్నారు. అయినా అది ఏమాత్రం అమలు కావడం లేదు. ముడుపులు చెల్లిస్తే మాత్రం వెంటనే పని చేసేస్తున్నారు. లేకుంటే కార్యాలయం చుట్టూ చెప్పు లరిగే దాకా తిరగాల్సిందే. అవితి అధికారులు, సిబ్బందిపై ప్రస్తుత ప్రభుత్వంలోనైన సరైన చర్యలు ఉంటాయో లేదో చూడాలని ప్రజలు వ్యాఖ్యాని స్తున్నారు

## సర్కారు వైద్యం.. అందనంత దూరం?

**ఖమ్మం,తెలంగాణ దిశ :**ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 2023లోని పరిస్థితులపై కేంద్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఇటీవల వెలువరించిన 'హెల్త్ డైనమిక్స్ ఆఫ్ ఇండియా' నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.వేధిస్తున్న సిబ్బంది కొరత భద్రాద్రి జిల్లాలో వైద్యులు, సిబ్బంది కలిపి 490 మంది విధులు నిర్వర్తించాల్సి ఉండగా 316 మంది పనిచేస్తున్నారు. ఆరు సీహెచ్‌సీల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత వేధిస్తోంది. కొన్నిచోట్ల దంత వైద్యులు, గైనకాల జిస్టులతోనే నెట్టుకొస్తున్నారు. ఖమ్మం జిల్లాలో పీహెచ్‌సీలు-26, పట్టణ ఆరోగ్య కేంద్రాలు-4, ఆరోగ్య ఉపకేంద్రాలు-231 ఉన్నాయి. పీహెచ్‌సీల్లో 76 వైద్యుల పోస్టులకు 27, స్టాఫ్ నర్సులు 70 పోస్టులకు 12, ఎంపీహెచ్ డబ్ల్యూ(ఫీమేల్) 213 పోస్టులకు 45, ఎంపీహెచ్‌డబ్ల్యూ(మేల్) 147 పోస్టులకు 107 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఫీల్డ్ వర్కర్స్ 45 పోస్టుల్లో 38 ఖాళీలే. వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖలో 662 పోస్టులకు 398 భర్తీకి నోచుకోలేదు. అనేకచోట్ల పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలు అద్దె భవనాల్లో అరకొర వసతులు మధ్య కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లె, బస్తీ దవాఖానాలుగా మార్చినా ఆశించిన స్థాయిలో వైద్యమందటం లేదు. ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి, పెనుబల్లి, మధిర, కల్లూరు, తిరుమ లాయపాలెం, వైరా, నేలకొండపల్లిలో సీహెచ్‌సీలున్నాయి. సివిల్ సర్జన్లు 51మందికి 33మంది లేరు. డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టుల్లో 52కు 48, సివిల్ అసిస్టెంట్ సర్జన్లలో 154కు 113 పోస్టులు భర్తీచేయలేదు. నర్సుల్లో 147కు 36మంది లేరు. హెడ్‌నర్సు పోస్టుల్లో 31కి 21 ఖాళీలున్నాయి. మిడ్‌వైఫరీ పదకొండు పోస్టులకు పదింటిని భర్తీ చేయాల్సి ఉంది. రేడియోగ్రాఫర్లు, ఫార్మసిస్టులు, ఫిజియోథెరఫిస్టులు ఇలా అనేక విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉండటంతో రోగులకు ఆశించిన స్థాయిలో సేవలందటం లేదు.



## కలవర పెడుతున్న కల్తీ ఆహారం..!

భోజన ప్రియులు పెరిగారు. ఇంటివంటకన్నా బయట బిర్యానీలు, కరీలకు ప్రాముఖ్యం పెరిగింది. అలాగే కరీపాయింట్స్ పెరిగాయి. రుచికరమైన హోటళ్లు..అమ్మచేతి వంట అంటూ ప్రచారం సాగిస్తున్నాయి. కానీ ఇలాంటి అనేక హోటళ్లలో పరిశుభ్రత డొల్ల అని ఇటీవల అధికారుల వరుస దాడలతో బట్టబయలు అయ్యింది. పరిశుభ్రత, నాణ్యత అన్నవి పక్కకు పోయాయి. ప్రపంచవ్యాప్తంగా మాంసాహార ప్రియులే ఎక్కువగా ఉంటారు. శాఖాహారం కన్నా మాంసాహారాన్నే చాలా మంది ఇష్టంగా ఆరగిస్తుంటారు.ఆదివారం వచ్చిందంటే చాలు చికెన్ లేదా మటన్ తెచ్చుకోవాల్సిందే. అమ్మ లేదా భార్యతో రుచికరంగా వండించుకుని తినాల్సిందే. ఇటీవల కాలంలో హోటళ్లు విపరీతంగా పెరిగిపోయాయి. స్విగ్గీ, జొమాటో వంటి ఆన్ లైన్ ఎ÷–లాట్ ఫామ్స్ వచ్చిన తర్వాత ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారి సంఖ్య బాగా పెరిగిపోతోంది. ఒక్క క్లిక్‌తో బిర్యానీ ఇంటి ముందుకే రావడంతో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆర్డర్ పెట్టుకుని తినేస్తున్నారు. అయినా ఆదివారం రోజును అంతా ఎంతో ప్రత్యేకంగా భావిస్తారు. ఆరోజు ఇంట్లో కచ్చితంగా నాన్ వెజ్ ఉడకాల్సిందే. లేదంటే ఏదో వెలితిగా అనిపిస్తుంటుంది. రోజు కచ్చితంగా నాన్ వెజ్ తినాల్సిందే అనే విధంగా పరిస్థితి తయారయ్యింది. ఇదే అదనుగా అనేకులు హోల్ బిజినెస్ రంగంలోకి దిగారు. రుచికరమైన, శుచికరమైన వంట అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ బొద్దింకలు, వెంట్రుకుల, మేకులు, జెర్రీలు ఇలా ఒకటేమిటి రకరకాల వస్తువులు , ప్రాణులు బిర్యానీల్లో దర్శనమిస్తున్నాయి. మాంసాహార ప్రియులకు ఆదివారం ప్రత్యేకమైన రోజు. చాలా దేశాల ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు స్థానిక చట్టాల ప్రకారం తమ ఉద్యోగులకు వారానికి ఓ రోజు ఇవ్వాల్సిన సెలవు దినాన్ని ఆదివారంగా ఎంచుకున్నారు. వారం మొత్తం కష్టపడి పని చేసిన ఉద్యోగులు తీవ్రమైన పని ఒత్తిడి, శరీర అలసటతో ఉంటారు. ఆ ఒక్కరోజు మాత్రం కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతుంటారు. అయితే మానవజాతి ఆవిర్భావం నుంచి నాన్ వెజ్ తినడానికే మనిషి ఎక్కువగా ఇష్టపడుతుంటాడు. అయితే ఆదివారం రోజున తమ కుటుంబసభ్యులతో కలిసి సరదాగా గడిసే సమయంలో మాంసాహారం ఉంటే ఇంక ఆ మజానే వేరుగా ఉంటుంది. అందుకే ఆదివారం రోజున చికెన్, మటన్, చేప వంటి మాంసాహారాలు తినేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. అలాగే పిల్లలు కూడా పాఠశాలలు, కళాశాలలకు వెళ్తూ వారం మొత్తం బిజీబిజీగా ఉంటారు. ఆ ఒక్కరోజే ఇంటి వద్ద ఉంటారు. అందుకే ఈ రోజున నాన్ వెజ్ తినేందుకు ఎక్కువగా మంది మొగ్గు చూపుతుంటారు. ఈ క్రమంలో ఆదివారాలు హోటళ్లకు గిరాకీ పెరుగుతోంది. సంప్రదాయమే కాలక్రమేనా సంస్కృతిగా మారి పోయింది. ఆదివారం మాంసాహారం తినని కుటుంబం అంటూ ఉండదు. దాదాపు ప్రతిఒక్కరూ ముక్క లేనిదే ముద్ద దిగదు అన్నట్లు ఆదివారాన్ని ప్రత్యేకంగా చూస్తారు. ఆ రోజు నాన్ వెజ్ తీసుకురాకపోతే పిల్లలు పెద్ద యుద్ధమే చేస్తుంటారు. దీంతో ఆదివారం నాన్ వెజ్ తినడం తప్పని సరిగా మారిపోయింది. అందుకే ఆదివారం నాడు చికెన్, మటన్ షాపుల ముందు ప్రజలు పెద్దఎత్తున బారులు తీరుతుంటారు. అదేరీతిలో హోటళ్లు కూడా కిక్కిరిసి పోతున్నాయి.

# భాగ్యనగర సౌభాగ్యం నిలిపేదెలా?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** చిన్న వర్షం వచ్చినా హైదరాబాద్ రోడ్లు వరదలను తలపిస్తున్నాయి. మామూలు రోజుల్లో ట్రాఫిక్ చిర్రెత్తు కొచ్చేలా చేస్తోంది. ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బందిగా మారుతోంది. వర్షాం వస్తే నరకం కనిపిస్తోంది. హైదరాబాద్ విస్తరిస్తున్నా అందుకు తగ్గట్లుగా డ్రైనేజీని ఆధునీకరించడం లేదు. అలాగే వానవస్తే నీరు పోయేలా చేయడం లేదు. వేలకోట్ల ఆదాయం వస్తున్నా నగరం అభివృద్ధి విషయంలో పాలకులు శ్రద్ధ వహించడం లేదు. కెసిఆర్ హైదరాబాద్ గురించి కాకమ్మ కబుర్లు ఎన్నో చెప్పారు. హుస్సేన్ సాగర్‌ను కొబ్బరి నీళ్లలా తయారు చేస్తానని ప్రగల్భాలు పలికారు. దాదాపు పదేళ్లు అధికారంలో ఉన్నా ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోంది. అయినా ఎలాంటి పురోగతి కానరావడం లేదు. ప్రలను బుజ్జగించే పనులు తప్ప కఠినంగా నగర సుందరీకరణ, ట్రాఫిక్ ఫ్రీ రోడ్లను అభివృద్ధి చేయడం లేదు. హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం కావాలి. ప్రధానంగా మురుగునీరు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు,ట్రాఫిక్ సమస్యలు ఎప్పటినుంచో వేధిస్తున్నాయి. నగరంలో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేసేస్తున్నారు. ఈ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. చెత్తను వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ పడేసే విధానాలకు స్వస్తి పలకాలి. అవసరమైతే జరిమానాలు విధించాలి. దీనికితోడు నగరంలో రోడ్లపై వెలసిన ఆలయాలు,దర్గాలు, ఇతర కట్టడాల తొలగింపుపై కఠిన చర్చలకు ఉపక్రమించాలి. లేకుంటే అవి రోడ్లకు అడ్డంగా ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. వీటి గురించి ఏ పార్టీ వారు కూడా మాట్లాడడం లేదు. మత కట్టడాలను తొలగించడం పాపమనా లేక, పార్టీలకు భయపడో కానీ వాటి జోలికి వెళ్లడం లేదు. హైదరాబాద్‌తో అనుబంధం ఉన్న వారిని, రాజకీయ పార్టీలను కూర్చోబెట్టి ఈ సమస్యలపై చర్చించాలి. రోడ్డు మధ్యలో ఉన్న ప్రార్థనా స్థలాలు, దర్గాల తొలగింపు అనివార్యం కావాలి. నగర సుందరీకరణ, విస్తరణలో వీటి తొలగింపు అత్యంత ముఖ్యం. అలాగే నాలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి. హైడ్రా కొంతమేర కూల్చివేతలు చేపట్టడం ఆహ్వానించదగ్గదే. అయితే నాలాల ఆక్రమణలను పెద్ద ఎత్తున తొలగించాలి. డ్రైనేజీ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలి. వర్షం వస్తే కాలనీలు మునిగే పరిస్థితి నుంచి బయటపడేలా ప్రణాళికలు సిద్ధం చూసుకోవాలి. హైదరాబాద్ రూపురేఖలు మారబోతున్నాయన్న విశ్వాసం ప్రజల్లో కలగాలి. ప్రజలను కూడా ఇందులో బాధ్యులను, భాగస్వాములను చేయాలి. ఇప్పటికే శివారు ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయి. తెలంగాణకు మణిహారమైన హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం రేవంత్ రెడ్డి పదేపదే చెప్పడం కాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలి. నగరంలో పారిశుద్ధ్య, మురుగు నీటి, తాగునీటి సమస్యలు గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైనట్లు ఎవరైనా అంగీకరించాల్సిందే. భాగ్యనగరాన్ని మరింత ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. దీనికితోడు మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణతో నగర రూపురేఖలు మారుతాయి. పట్టణ విపత్తుల నివారణకు, వాటిని ఎదుర్కొన డానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయం చేసుకోవాలి. ఇప్పుడు హైడ్రా తన పనిని వేగంగా చురుకుగా చేపట్టడం కలసి వస్తోంది. అలాగే అన్యక్రాంతం అయిన భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇకపోతే ప్రధానంగా నగరంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పాటు శివారు ప్రాంతాలు విస్తరించి, నగరంలో కలిసి పోవడం, పట్టణీకరణ విషయంలో క్రమపద్ధతి లేకపోవడంతో నగరం నరకకూపంగా మారుతోంది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీల పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం చేస్తామని సిఎం రేవంత్ పదేపదే ప్రకటించారు. అలాగే, నదీ తీర ప్రాంతంలో క్రొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు వెలిసి, పాత హెరిటేజ్ ప్రాంతాలు క్రొత్తదనాన్ని సంతరించు కుంటాయి. ఇకపోతే జిహెచ్ఎంసి పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఎయిర్ పోర్ట్ వరకూ మెట్రో విస్తరణ సాకారమయితే మరింత సౌకర్యంగా ఉంటుంది. పాత నగరానికి మెట్రో విస్తరణ, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ వంటివన్నీ కూడా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేవే. ఇకపోతే నగరంలో విలువైన భూములు అన్యాక్రాంతం అయినా గత పదేళ్లుగా పట్టింపు లేకుండా పోయింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములు ఏ విధంగానైతే అన్యాక్రాంతమయ్యాయో, స్వరాష్ట్రంలో దానికి రెట్టింపు భూ విధ్వంసం జరిగింది. ఆనాటి గొలుసుకట్టు చెరువులు చాలా మాయం చేసి, కొండలు, గుట్టలను పిండి చేసి రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చేసి అమ్మేశారు. గత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూములకు రక్షణగా ఉండే వీఆర్ఓ, వీఆర్ఏలను రెవెన్యూశాఖ నుంచి దూరం చేయడంతో కబ్జాలకు ప్రభుత్వమే ఉసిగొలిపినట్టయ్యింది. అధికార అండతో విలువైన భూములను కాజేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో జరిగిన భూ విధ్వంసంపై దృష్టి పెట్టి కఠిన చర్యలకు ఉపక్రమించాలి. ప్రభుత్వ భూములను, చెరువులను కాపాడేందుకు హైడ్రా చేస్తున్న కృషికి అందరూ తోడ్పాటు అందించాలి. జీహెచ్ఎంసీ పరిధిని ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరిం చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నందున, జీహెచ్ఎంసీతో పాటు ఔటర్ వరకు ఉన్న ప్రాంతాలు హైడ్రా పరిధిలోకి వచ్చాయి.

## జలసేద్యం.. ఆరోగ్య భాగ్యం..


**మిర్యాలగూడ,తెలంగాణ దిశ :..** అతనో సాధారణ రైతు కుటుంబంలో జన్మించాడు. డిగ్రీ వరకు చదివినప్పటికీ వ్యవసాయంపై మక్కువతో తమకున్న భూమిలో పలు రకాల పంటలు సాగిస్తున్నాడు. అందరిలా కాకుండా.. వినూత్నంగా, ఆరోగ్యకరంగా ఆకుకూరలు పండించాలని సంకల్పించి.. ఇది వరకే సాగు చేస్తున్న వారి సలహాలతో జలసేద్యాన్ని ప్రారంభించాడు. ఇటీవలే పంట వినియోగానికి సైతం వచ్చింది. జలసేద్యం కోసం మిర్యాలగూడలోని బైపాస్ రహదారి పక్కన పది గుంటల స్థలంలో సుమారు రూ.50లక్షల వ్యయంతో ప్రత్యేకంగా పాలీ హౌస్ ఏర్పాటు చేశాను. వీటి ప్రత్యేకత ఏంటంటే కాలమేదైనా వాతావరణం మారకుండా చూసుకుంటాయి. దీంట్లో భాగంగా తొలుత ఆకుకూరల విత్తనాలను చిన్న చిన్న ట్రేలలో కోకోపిట్(కొబ్బరి పీచు పొడి)లో 15 రోజుల పాటు ఉంచుతాం. అనంతరం ఆ మొక్కలను పైపు ఛాంబర్లలోకి మార్చుతాం. ఇందులో ఎటువంటి మట్టి, కోకోపిట్ ఉండదు. వీటికి పైపుల ద్వారానే కావాల్సిన పోషకాలు అందిస్తాం. మొత్తం మూసి ఉంచడం వల్ల ఎటువంటి పురుగులు, దోమలు లోపలికి రావు. మరీ అవసరమైతే వేప నూనె మాత్రం కొడతాం. నిరంతరం 30డిగ్రీల సెల్సియస్ లోపు ఉష్ణోగ్రత ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటాం. సాధారణ పద్ధతిలో పండించిన ఆకుకూరల్లో అధిక శాతం వృథాగా పోతుంది. జలసేద్య పద్ధతిలో పండించిన ఆకుకూరల్లో ఎటువంటి వృథా ఉండక పోగా.. కాడలు సైతం తినొచ్చు. ఆరోగ్యంతో పాటు రుచిలో ఎంతో వ్యత్యాసం ఉంటుంది. ప్రస్తుతం పాలకూర, తోటకూర, చుక్కకూర, కొత్తిమీర, పుదీనా, చెర్రీ టమాట వంటి పంటలు సాగు చేస్తున్నాం. నా పేరు పడిగపాటి వెంకట్‌రెడ్డి. మాది దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామం. నాకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. దీంతో కొన్నేళ్లుగా వ్యవసాయంలో వినూత్న పద్ధతుల్లో పంటలు సాగు చేస్తున్నాను. ప్రజలకు ఆరోగ్యకరమైన ఆకుకూరలు అందించాలనే లక్ష్యంతో అన్వేషిస్తుండగా.. యూట్యూబ్‌లో హన్మకొండకు చెందిన రవికిరణ్‌రెడ్డి వీడియోలు చూసి వారి సలహాలతో జలసేద్య పద్ధతిలో ఆకుకూరలు సాగు చేయడం ప్రారంభించాను. ప్రస్తుతం మేము ఇటీవలే ప్రారంభించిన హొటల్ విహార్‌లో ఈ ఆకుకూరలు, కూరగాయలు వినియోగిస్తున్నాం. దీంతో పాటు ఇక్కడికి వచ్చిన వినియోగదారులకు సైతం ఆకుకూరలు విక్రయిస్తున్నాం. ప్రతి 25 రోజులకోసారి పంట వస్తుంది. త్వరలోనే ఆన్‌లైన్‌లో విక్రయాలు ప్రారంభించి.. డోర్ డెలివరీ సైతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

## ప్రయాణికుల పాలిట శాపంగా ఆటోల్లో ప్రయాణం..!?



**పెద్దవూర,తెలంగాణ దిశ :** ఆటోల్లో ప్రయాణించడం ప్రయాణికుల పాలిట శాపంగా మారుతోంది. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తుండడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. వివిధ గ్రామాలనుంచి పత్తి,మిరప,వరి కోతలు, బత్తాయిలు తెంచడానికి, నాట్ల కోసం హైదరాబాద్, నాగార్జున సాగర్, కోదాడ, జెడ్చర్ల జాతీయ రహదారి పై50,నుంచి 60 కిలోమీటర్లు దూరం ఆటోలలో కూలీలు వెళుతుంటారు.ఆటోలో 20 మందికి పైగా వున్నారని, నిదానంగా వెళ్లాలని ఆలోచనఆటో డ్రైవర్లకు లేకపోవడంతో అదుపు తప్పి పడిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. కాని ఆటో ప్రయాణికులు తమ గమ్య స్థానాలు చేరుకునే వరకు ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోతోంది. వరుసగా అక్కడక్కడ జరుగుతున్న ఆటో ప్రమాదాల వల్ల ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఆటో డ్రైవర్ పక్కన కూర్చున్న వాళ్ళు కొద్ది దూరం వెళ్లే సరికి పట్టుతప్పి కింద పడిపోయి మృతి చెందిన పలు సంఘటనలు మండలంలో చోటు చేసుకున్నాయి.ఎక్కువ మందిని తీసుకేళుతున్న ఆటోలు మలుపుల వద్ద బోల్తాపడి అనేక ప్రమాదాలు జరుగుతున్నా యి. ఆటో ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగం, నిర్లక్షపు డ్రైవింగ్, అజాగ్రత్తేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. డ్రైవర్కు ఇరుపక్కల, లగేజీ వేసే చోట కూడా ప్రయాణికులను కూర్చొబెట్టి పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తరలిస్తున్నారు. ఆటోలో పైన కూర్చొని వెళుతున్నారు. తగిన జాగ్రత్తలు పాటించకుండా అతివేగంతో వాహనాలు నడ పడం వల్ల, మద్యం సేవించి నడపడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. డ్రైవర్లు పోటీపడి నడపంవల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పరిమితికి మించి ప్రయాణికులను తరలించడంవల్ల ఆటోలు అదుపు తప్పుతున్నాయి.

# వైసీపీలో ఏం జరుగుతోంది..?



**విజయవాడ,తెలంగాణ దిశ ::** వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఆయనతో పాటు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి కూడా రాజీనామా చేశారు. వైసీపీలో కీలకమైన నాయకులు పార్టీకి ఒకే రోజు రాజీనామా చేయడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేశాయి. వైసీపీలో నంబర్ 2 స్థానంలో తిరుగు లేని అధికారాన్ని అనుభవించిన సాయిరెడ్డి అనూహ్యంగా రాజకీయాల నుంచి నిష్క్రమించారు.వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి వ్యాపార నిర్వహణ బాధ్యతల నుంచి మొదలైన సాయిరెడ్డి పయనం అనూహ్యంగా ముగించారు. జగన్ రాజకీయాల్లోకి రాక ముందు నుంచి ఆయనతో కలిసి సాయిరెడ్డి పయనించారు. కొన్నేళ్లుగా ఇద్దరి మధ్య దూరం పెరిగినట్టు వైసీపీ వర్గాల్లో ప్రచారం జరిగినా ఎన్నికలకు కొద్ది నెలల ముందు ఆయనకు కీలక బాధ్యతలు దక్కాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో సాయిరెడ్డి రాజీనామా చేసినట్టు తెలుస్తోంది.2022లో వైసీపీ ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి విజయసాయిరెడ్డిని జగన్ తప్పించినప్పటి నుంచి ఇద్దరి దూరం పెరిగినట్టు సన్నిహితులు చెబుతున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాయి రెడ్డి తిరుగులేని అధి కారాన్ని ప్రదర్శించారు. వైసీపీలో జగన్ తర్వాత స్థానాన్ని సాయిరెడ్డి పోషించారు. ఈ క్రమం లో పార్టీలో మిగిలిన ముఖ్య నేతలతో ఆయన కు పొసగలేదు.ఉత్తరాంధ్రలో ప్రధానంగా విశాఖపట్నంలో తలెత్తిన వివాదాలకు సాయిరెడ్డి కేంద్ర బిందువుగా మారారు. భూవివాదాలు, సెటిల్మెంట్ల ఆరోపణలు, ప్రతిపక్షాల విమర్శలకు విశాఖ కేంద్రంగా మారింది. దీంతో పాటు పార్టీలో ఆధిపత్య పోరులో ఆయన ఒంటరి అయ్యారు. ఓ వైపు వైవీ సుబ్బారెడ్డి, మరోవైపు సజ్జల వంటి వారి నుంచి పోటీ ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో 2022లో అనూహ్యంగా ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి సాయిరెడ్డిని తప్పించారు.ఉత్తరాంధ్ర బాధ్యతలు తప్పించిన తర్వాత సాయిరెడ్డి దాదాపు ఆర్నెల్ల పాటు తాడేపల్లికి కూడా రాలేదు. పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండిపోయారు. ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టిన నేతలు సమర్థంగా వ్యవహరించక పోవడం, ప్రత్యర్థులపై దూకుడు ప్రదర్శించ లేకపోవడం వంటి కారణాలతో అనివార్యంగా సాయిరెడ్డికి పార్టీ బాధ్యతలు అప్పగించాల్సి వచ్చింది. దాదాపు ఏడాది తర్వాత సాయిరెడ్డికి పార్టీ అనుబంధ విభాగాల బాధ్యతల్ని అప్పగించారు. ఆ తర్వాత కొద్ది నెలలకు దక్షిణ కోస్తా జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ప్రకాశం, తిరుపతి, నరసరావుపేట, నెల్లూరు జిల్లాలను సాయిరెడ్డికి అప్పగించారు.ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఎంపికతో పాటు ఎన్నికల నిర్వహణ, సమన్వయం వంటి అంశాల్లో సాయిరెడ్డి చురుగ్గానే వ్యవహరించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత పరిణామాలు మారిపోయాయి. వివాదాలు చుట్టు ముట్టాయి. వ్యక్తిగతంగా సాయిరెడ్డి చిక్కుల్లో పడ్డారు. మరోవైపు పార్టీ ఓటమికి కారణాలను బేరీజు వేసుకునే క్రమంలో 2019–24 మధ్య కీలకంగా వ్యవహరించిన నేతల తీరుతో ఎక్కువ నష్టం జరిగిందనే భావన జగన్మోహన్ రెడ్డిలో పెరిగినట్టు వైసీపీ నేతలు చెబుతున్నారు. పార్టీ ఓటమితో పాటు ఇతర అంశాలకు ముఖ్య నేతల్ని నిందించడం వారికి మనస్తాపం కలిగించినట్టు సన్నిహితులు చెబుతున్నారు. రాజకీయ కారణాలతో పాటు వైసీపీ ముఖ్య నాయకుల వరుస రాజీనామాల వెనుక కేసుల భయం వెంటాడినట్టు విశ్వసనీయ వర్గాలు సమాచారం. విజయసాయిరెడ్డి ఇప్పటికే జగన్ మోహన్ రెడ్డి ఎదుర్కొంటున్న పలు కేసుల్లో సహ నిందితుడిగా ఉన్నారు. వైసీపీ ఓటమి తర్వాత ఆయనపై మరో కేసు నమోదైంది. ఈ కేసు వ్యవహారంలోనే తాజా రాజకీయ పరిణామాలు జరిగి ఉంటాయనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి. కాకినాడ సీ పోర్ట్ వ్యవహారం కొద్ది రోజులుగా ఏపీ రాజకీయాల్లో కాక రేపుతోంది. అనూహ్యంగా ఈ వ్యవహారంలో కొద్ది రోజుల గతంలో జరిగిన క్రయవిక్రయాలు రద్దైనట్టు వార్తలు వెలువడ్డాయి. ఇది జరిగిన రెండు రోజులకే అనూహ్యంగా సాయిరెడ్డి రాజీనామా వెనుక ఏదో జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.వైసీపీలో ఒకే రోజు ఇద్దరు ఎంపీల రాజీనామా చేయడం వెనుక వ్యూహాత్మక ఎత్తుగడలనే అనుమానాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఏపీలో వైసీపీ కేవలం 11 స్థానాలకు పరిమితం అయ్యింది.లోక్‌సభలో ఆ పార్టీకి ముగ్గురు మాత్రమే ఎంపీలు ఉన్నారు. రాజ్యసభలో బీజేపీకి ఎంపీల అవసరం ఉంది. కీలక బిల్లుల్ని నెగ్గించుకోవడానికి ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది.

ఈ క్రమంలో వైసీపీ సభ్యులు రాజీనామాలు చేస్తే ఏర్పడే ఖాళీల్లో బీజేపీ దక్కించుకోవచ్చు. సంఖ్యాబలం నేపథ్యంలో టీడీపీ–బీజేపీ కూటమికి అవి దక్కుతాయి. సాయిరెడ్డి, అయోధ్య రామిరెడ్డితో పాటు మరో ఎంపీ కూడా రాజీనామా చేస్తారని ఏపీ రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే బీదమస్తాన్ రావు, ఆర్ కృ?ష్ణయ్య, మోపిదేవిలు వైసీపీ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామాలు చేశారు. బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్యలు తిరిగి ఎంపీలుగా ఎన్నికయ్యారు. టీడీపీ నుంచి సానా సతీష్ గెలిచారు. ఇప్పుడు మరికొన్ని స్థానాలు ఖాళీ అయితే అవి కూటమి ఖాతాకు దక్కుతాయి. వైసీపీ ఎంపీల రాజీనామాలు వ్యక్తిగత కారణాలతో అయినా జగన్ సమ్మతితోనే జరిగి ఉండొచ్చనే ప్రచారం కూడా ఉంది.

### చల్లా చల్లని చందమామా..

# నిన్ను మండే సూర్యుడిగా మారుస్తాం



చందమామ రావే..జాబిల్లి రావే అని పసిపిల్లలకు పాటల రూపంలో జోకొట్టినా వెన్నెల రాత్రులపై ఎన్నో యుగళగీతాలు వచ్చినా అడవికా చిన వెన్నెల అని సామెతలు ఉన్నాయి. చందమామ ఈ అవనిపై యుగయుగాలుగా చల్లటి వెన్నెల కురిపిస్తున్నాడు. అయితే ఆయనకు కూడా మానవుల నుంచి ముప్పు రానుంది. జాబిల్లిపై ఏకంగా అణురియాక్టర్ నిర్మించేందుకు అమెరికా, చైనా, రష్యాలు పోటీపడుతుండటంతో యావత్ ప్రపంచం ఉలిక్కిపడుతోంది. వాస్తవానికి ఈ ప్రతిపాదన గతంలోనే ఉన్నా చైనా, రష్యాలు దూసుకురావడంతో అమెరికా సైతం రంగంలోకి దిగడంతో పోటీ ప్రారంభమైంది.

ఎందుకు?: చంద్రునిపై వాతావరణం పరిశోధనలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి అనుకూలం కాదు. దీంతో సోలార్ ప్యానెల్స్ అక్కడ నిరుపయోగమే. దీంతో విద్యుత్ ఉత్పత్తికి న్యూక్లియర్ రియాక్టర్‌లు అవసరమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. చంద్రునిపై అనేక భాగాల్లో సూర్యరశ్మి ప్రసరించదు. దీంతో వీటి నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. సుదీర్ఘకాలం పరిశోధనలు నిర్వహించేందుకు ఈ రియాక్టర్లు అవసరమని ఆ దేశాలు వాదిస్తున్నాయి.

భౌగోళిక అంశాలు: అందుకే చంద్రునిపై త్వరితంగా అణు రియాక్టర్ నిర్మిస్తే అందులో తమదే పైచేయి అవుతుందని ఈ దేశాలు భావిస్తున్నాయి. చంద్రునిపై అపారంగా ఖనిజాలున్నట్టు తెలుస్తోంది. ఆర్థికంగానూ, పరిశోధనల అంశంలోనూ ముందంజలో ఉండాలని ఈ దేశాలు పోటీపడుతున్నాయి. ప్రత్యేకించి చంద్రునిపై మానవ ఆవాసాలు ఉండాలంటే కచ్చితంగా విద్యుత్ అవసరం. ఈ రియాక్టర్ నిర్మాణంతో అతి త్వరలోనే చంద్రునిపై నివాసముండాలని ఈ దేశాలు యోచిస్తున్నాయి.

అంతా ఈజీ కాదు: అయితే అంతరిక్ష ఒప్పందం ప్రకారం అంతరిక్షంలో దేశాల మధ్య పోటీ ఉండకూడదు. ఆయుధాలను మోహరించకూడదు. శాంతి ప్రయోజనాలకే వినియోగించాలి. కానీ ఈ ఒప్పందం ఈ దేశాలను ఎంతవరకు నిలువరించగలదన్నదే ప్రశ్న. ఇప్పటివరకు సాంకేతిక, సమాచార, సైనిక ఉపగ్రహాలు ఉన్న అంతరిక్షంలో అణు రియాక్టర్ రానుండటం అందరిలో ఆందోళన కలిగిస్తోంది. చంద్రునిపై నిర్మించే అణురియాక్టర్‌లో ఏదైనా పొరబాటు చోటు చేసుకుంటే వచ్చే ఫలితాలను ఊహించలేం. కోట్ల సంవత్సరాలుగా చల్లని వెలుగులిస్తున్న జాబిల్లిని కబళించేందుకు భూమిమీద నుంచి కంసమామలు బయలుదేరుతున్నారంటే అతిశయోక్తి కాదేమో.

# బాలరాజు బాటలో అబ్రహం..!

మహబూబ్ నగర్, : తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉన్న అలంపూర్ నియోజకవర్గం ఎప్పుడు రాజకీయ మ లుపులో ప్రత్యేకతను చాటుకుంటూనే వస్తుంది. మాజీ ఎమ్మెల్యే అబ్రహం ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ తన అ నుచరవర్గం మాత్రం బిజెపివైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు బిజెపి దక్షిణాది రాష్ట్రాల్లో తన వశం చేసుకోవాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్ళుతు ఆంధ్రప్రదేశ్లో ఇప్పటికే పొత్తులో భాగంగా అధికారంలోకి రాగా తెలంగాణ రాజకీయా ల వైపు పాగా వేయాలని అడుగులు వే స్తుంది. టిఆర్ఎస్ పార్టీలో పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన వారితోపాటు కాంగ్రెస్ లో ఉన్న అసంతృప్తి నాయకులను ఆకర్షించేందుకు పావులను కదుపుతుంది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వ ల బాలరాజు ఇప్పటికే బి ఆర్ఎస్ పార్టీని వీడి బిజెపి పార్టీలోకి చేరగా గద్వాల జిల్లా అలం పూర్ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది తన ప్రజా బలాన్ని ఆకర్షించే నేతగా అబ్రహం ఏదిగారు. గత ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ నుండి టికెట్ ని ఆశించి తీవ్రంగా శ్రమించిన ఆయనకు విజేయుడు రూపంలో అదృష్టం చేజారింది. నువ్వా నేనా అంటూ ఉద్రిక్త భరితంగా చివరి వరకు టికెట్ వస్తుందని ఆశించిన ఆయనకు చల్లా వెంకట్రామిరెడ్డి ఆశీస్సు లు కోల్పోయి టికెట్టు దగ్గకపోవడంతో ఆ యన భంగపడ్డారు. దీంతో వెంటనే తనని కాదని పార్టీ టికెట్ ఇచ్చిన విజేయుడు ను ఓ డించేందుకు ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎ మ్మెల్యే సంపత్ కుమార్ గెలుపు కోసం చే తులు కలిపి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.

రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో స్వల్ప మెజా ర్టీతో ఓడిన సంపత్ కుమార్ వద్ద క్రమంగా ప్రత్యక్ష రాజకీయాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. క్రమంగా పార్టీ కార్యక్రమాలు సభలు సమావేశంలో హాజరు కావడం లేద ని ప్రచారం లో ఉంది. తన రాజకీయ జీవితంలో తన వారసుడు మమకమై తన వెను క ఉండి చూసుకున్న తన కొడుకును తన రా జకీయ వారసుడిగా ప్రజలకు పరిచయం చేయాలనుకున్న తరుణంలో బి ఆర్ ఎస్ పార్టీ తనకు టికెట్ ఇవ్వకపోవడంతో తన కొడుకు రాజకీయ జీవితం ఎలాగైనా చక్కపెట్టాలన్న ఆలోచనతో బిజెపిలోకి అడుగులు పెట్టేందు కు యోచిస్తున్నట్లు తన సన్నిత వర్గాల ద్వా రా తెలిసింది.ఇప్పటికే బిజెపి ముఖ్య నాయకులతో సంప్రదింపులు జరిగినట్లు ప్రచార సైతం జోరుగా వినిపిస్తోంది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలోకి అడుగుపెట్టిన వెంటనే సాధ్య అసా ధ్యాలపై పరిస్థితులను అంచనా వేసి ముం దుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టమవుతుంది. పరోపక్క తను పార్టీ మారుతున్నట్లు లీకులు ఇచ్చిన వెంటనే తనను కాంగ్రెస్ పా ర్టీ బుజ్జగిస్తుందా అన్న ఆశతో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తనకుమారుడికి క్రియాశీల పదవి ఇస్తారని ఆశతో ఉన్నట్టు ప్రచారం జోరుగా వినిపిస్తుంది.

పేదల డాక్టర్‌గా, వివాదరహితుడిగా ఉన్న డాక్టర్ అబ్రహం2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో అబ్రహం అనుచరులు, అభిమానులు రాజకీయంగా తగిన నిర్ణయం తీసుకోవాలని అబ్రహంపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. పలు మండ లాల నాయకులు మంతనాలు చేస్తుండ దంతో వేచి చూద్దాం అన్న ధోరణిలో మాజీ ఎమ్మెల్యే ఉన్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో నడిగడ్డకు చెందిన బీజేపీ ముఖ్య నేతలు రంగంలోకి దిగి అబ్రహంను బీజేపీలోకి రావలసిందిగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది.స్థానిక సంస్థల ఎన్నికల లోపు నిర్ణయం తీసుకోవాలని కొంతమంది సూచిస్తుంటే.. మరి కొంతమంది స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత నిర్ణయాలు తీసుకుంటే బా గుంటుంది అని మరి కొంతమంది మాజీ ఎమ్మెల్యేకు సూచిస్తున్నట్లు సమాచారం. మొత్తం పైన డాక్టర్ అబ్రహం భారతీయ జనతా పార్టీలోనే చేరే అవకాశాలు ఉన్నాయని నియోజకవర్గంలో జోరుగా ప్రచారంజరుగుతోంది.

# సేంద్రియ ఎరువులపై అనాసక్తి

### రసాయన వాడకాలతో భూసారానికి ముప్పు

వరంగల్, : సేంద్రీయ ఎరువుల వాడకం పెంచేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా రైతుల్లో అవగాహన కల్పించకపోవడంతో కనీసం నిర్దేశిరచిన లక్ష్యాన్ని కూడా చేరుకోలేకపోతున్నారు. అధికారులు దృష్టి సారించకపోవడంతో కనీస లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గుంతల నిర్మాణం చేపట్టుకుంటే రైతులకు వ్యయం భారం తగ్గడమే కాకుండా సేంద్రీయ ఎరువులను తయారు



చేసుకోవచ్చని అధికారులు అన్నారు. అయితే అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించక పోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరక పోవడంతో పాటు రైతులకు ప్రయోజనం లేకుండా పోతుంది. పంట పొలాల్లో రసాయనిక ఎరువులు తగ్గించాలని ప్రచారం చేయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉచితంగా రైతులకు ఉపాధి హామీ ద్వారా నిర్మాణాలు చేపడుతున్నా అధికారుల పర్యవేక్షణతోపాటు నిర్లక్ష్యంలో లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం రైతుల ఇళ్లలో నాడేప్ కంపోస్టు గుంతల కింద గుర్రపు నాడల గుంతల నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించినా ఎక్కడా పూర్తి కాకపోవడంతో లక్ష్యం చేరుకోలేక పోతున్నారు. గుంతలను సద్వినియోగం చేసుకుంటే రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా మారనుంది. సేంద్రీయ ఎరువు తయారీ చేయుటకు రైతుల భూమిలోని చెత్తను, ఇళ్ల పరిసరాల్లోని చెత్తను కంపోస్టు గుంతలో ఒకసారి మూడు వరసలో చెత్తను వేసి చేసుకునేలా సూచనలు చేస్తున్నారు.

గుంత నింపిన తరువాత దానిపై గోనె సంచులు వేసి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నీళ్లు చల్లుతూ ఉండాలి. ఇలా మూడు, నాలుగు నెలల్లో సేంద్రీయ ఎరువు తయారవుతుంది.

ఇలా ఎరువు తయారీ చేసుకోవడంతో రసాయనిక ఎరువులను తగ్గించడమే కాకుండా భూసారాన్ని పెంచుకుని అధిక దిగుబడులు సాధించుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కంపోస్టు గుంతల నిర్మాణాలపై ఇప్పటికే అవగాహన కల్పించారు. అయినప్పటికీ రైతులు ముందుకు రావడంలేదు. మరింత అవగాహన కల్పించి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## అడుగంటిన భూగర్భ నీరు


### వానాకాలంలో నీటి ఇక్కట్లు

అదిలాబాద్, : వర్షాకాలంలో సైతం మంచినీటి కోసం ప్రజలు తిప్పలు పడుతున్నారు. కనీస మౌలిక సదుపాయా లు లేక ఆదిలాబాద్ జిల్లాలోనిపలు గ్రామాల ప్రజలు నేటికీ ఇబ్బంది పడాల్సి న పరిస్థితి నెలకొంది. ఇదే కోవకు చెందింది బజారత్నూర్ మండలంలోని దిగ్నూర్ గ్రామం.వర్షాకాలంలో సైతం గ్రామస్తులు ఇంటింటికి తిరిగి నీళ్లు ఆడుకునే పరిస్థితి నెలకొం దంటే వారి పరిస్థితి ఏ విధంగా ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గ్రామంలో మంచినీళ్లు లేవు,

మురికి కాలువలులేవు, చెత్త చెదారం పేరుకుపోయి అపరిశుభ్రత తాండవిస్తోంది. గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు రాక.. నీటి కోసం గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బంది అంతాఇంతా కాదు.వర్షాకా లంలోనే నీటి కోసం ఇంత ఇబ్బంది పడుతుంటే ఇక వేసవికాలంలో గ్రామస్తులు అవస్థలు చెప్పనక్కర్లేదు. గ్రామంలో ఉన్న ఏకైక బోరు సైతం చెడిపోయి సంవత్సరాలు గడుస్తున్న పట్టించుకునే నాధుడే లేదు. దిగ్నూర్ గ్రామంలో సరైన రహదారులు మురికి కాలువలు లేక చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం పెద్దజల్లుతోంది. గ్రామ పంచాయతీ పాలకవర్గాలు లేక వర్షాకాలంలో

పారిశుద్ధ్యం పనులు జరగక ప్రజలు సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. తమ పంచాయితీకి నిధులు లేవు, కొట్టిన బిల్లులు కూడా ఇప్పటి వరకు క్రెడిట్ కాలేదు. మేము మా జేబులో నుండి డబ్బులు పెట్టాము. బోరు, మోటారు, విధి దీపాల కోసం ఇచ్చోడ వెళ్లి షాప్ లల్లో అడిగితే మీ జి.పి బిల్లులు రావు మేము ఉద్దెర ఇవ్వము అని అంటున్నారు. కావున జిపి ఫండ్స్ వస్తేనే గ్రామంలో పనులు చేపట్టగలమని గ్రామ పంచాయితీ కార్యదర్శి మౌనిక అంటున్నారు.

# ఫసల్‌బీమా యోజనతో రైతులకు అండ




### ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో ఆనందం

హైదరాబాద్, : కేంద్రం తీసుకుని వచ్చిన ఫసల్ బీమాలో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రైతులకు మేలు జరుగుతుందని కూడా తెలిపింది. రైతులను ఆదుకునే క్రమంలో పసల్ బీమా యోజనలో చేరడం, రైతల కిస్తీకూడా ప్రభుత్వమే భరిస్తుందిన సిఎం, డిప్యూటి సిఎంలు కూడా వెల్లడించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది..ప్రకృతి కరుణించక అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతూ... ఇక వ్యవసాయం వద్దు అనుకునే రైతన్నకు ప్రధానమంత్రి ఫసల్ భీమ యోజన అండగా నిలుస్తోంది. దేశానికి వెన్నుముక రైతు , రైతు పంటలు పండిస్తేనే ప్రజలకు ఐదు వేళ్ళు నోట్లోకి వేలుతాయి. అలాంటి రైతు తాము పండించిన పంటకు అకాల వర్షాలతోనో అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతే అ రైతు పరిస్తితి ఏంటి అనుకునే తరుణంలో ఫసల్ బీమాయోజన వారికి ఆసరాగా నిలిచింది. పంట నష్టపోయిన రైతన్నను అమ్మలా అదుకుంటూతుంది. వ్యవసాయం దండుగ అని గతంలో అన్న రైతుకు వ్యవసాయం పండుగా అనేలా ప్రతి రైతు ప్రకృతి వైపరీత్యాలకు బెదరకుండా తమ భూమిని సాగు చేసి వ్యవసాయాన్ని చేసే దైర్యాన్ని ఇస్తుంది.. ఫసల్ బీమా యోజన పథకం. రైతు తాము పండించే పంట పెట్టుబడి ఎకరాకు అందులో రెండు శాతం ఫసల్ బీమా పథకం ప్రీమియం కడితే చాలు వరిపంటకు ఎకరాకు 34 వేల బీమా ఉండగా అందులో రెండు శాతం అంటే 680 రూపాయలు ప్రీమియం కడితే చాలు అలగే మొక్క జొన్న ... వేరుశనిగే పంటలకు రెండు శాతం ఉండగా పసుపు పంటకు మాత్రం 3.5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంది.. దీంతో రైతుకు ఎదురయ్యే ఇబ్బందులు తెగుళ్ళ .. వడగళ్ళు.. పిడుగులు.. అకాల వర్షాలతో పంట నష్టపోతే ఆ రైతుకు ఫసల్ బీమా రక్షణగా నిలుస్తుంది.. వీటితో పాటు ఇందులోనే వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ద్వారా పత్తి పంటతో పాటు మిర్చిపంటకు కూడా రైతు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే వాతావరణం అనుకులించ కున్న వేసిన విత్తనం మొలకేత్తకపోయిన రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట పెట్టుబడి నష్ట పోకుండా ఫసల్ బీమా పథకం అండగా నిలుస్తుంది. పంటకోత తర్వాత జరిగే నష్టాలకూ బీమా వర్తిస్తుంది. పంటనష్టం జరిగిందని తెలియగానే బీమా మొత్తంలో 25 శాతం మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు.

అంతేకాదు క్లెయిమ్ సెటిల్ కోసం పంట నష్టాన్ని అంచనా వేయటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడతారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా పంట కోత సమాచారాన్ని ఫొటోలు తీసి, అప్‌లోడ్ చేస్తారు. గతంలో ఎన్నో పంట బీమా పథకాలు ఉన్న కూడా తాము అకాల వర్షాలతో నష్టపోయే వాళ్ళమని... ఇప్పుడు ఫసల్ బీమాపై వ్యవసాయ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు అవగాహన కల్పించడంతో తాము వ్యవసాయం అంటే కష్టం కాదని వ్యవసాయాన్ని ఇష్టంతో చేసుతున్నామని రైతులు తెలుపుతున్నారు.

# కొత్తగా సుధార్ మార్ట్ లు

విశాఖపట్టణం: ఏపీ ప్రభుత్వంవినూత్న నిర్ణయాలు తీసుకుంటోంది. దాదాపు అన్ని శాఖల పరిధిలో స్వతంత్ర నిర్ణయాలు ఉంటున్నాయి. అందులో భాగంగా జైళ్ళ శాఖ ఆధ్వర్యంలో సుధార్ మార్టులు ఏర్పాటు అవుతున్నాయి. విశాఖ సెంట్రల్ జైలులో ఖైదీల జీవితాల్లో మార్పు కోసం జైళ్ల శాఖ వీటిని ఏర్పాటు చేస్తోంది. అక్కడ ఖైదీలు తయారు చేసిన వస్తువులు, కూరగాయలు తక్కువ ధరకి లభిస్తాయి. దుప్పట్లు, బెడ్ షీట్లు, బ్లీచింగ్ పౌడర్, కేకులు, కూరగాయలు వంటివి మార్కెట్ ధర కంటే తక్కువకు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ మార్టుల ద్వారా లభించే డబ్బును ఖైదీల సంక్షేమానికి ఉపయోగిస్తారు. సుధార్ మార్టుగా పిలిచే.. ఈ దుకాణాల్లో కూరగాయల నుంచి కేకుల వరకు? దుప్పట్ల నుంచి బ్లీచింగ్ పౌడర్ వరకు చాలా తక్కువ ధరకే విక్రయిస్తారు. ఏపీ జైళ్ల శాఖ తీసుకున్న ఈ నిర్ణయం మంచి ఫలితాలు ఇస్తోందివిశాఖలోని సెంట్రల్ జైల్లో ఖైదీల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు జైళ్ల శాఖ అడుగులు వేస్తోంది. శిక్ష పడిన ఖైదీలకు వృత్తి విద్యలో శిక్షణ ఇస్తున్నారు. వారు తయారు చేసిన వస్తువులు, పండించిన కూరగాయలను, పండ్లను, జైలు అవసరాలకు వాడుతున్నారు. మిగిలిన వాటిని సుధార్ మార్ట్ ద్వారా తక్కువ ధరలకు స్థానికులకు అందిస్తున్నారు. ఖైదీలలో మార్పులు తెచ్చేందుకు జైళ్లలో వారితో అనేక రకాల పనులు చేయిస్తుంటారు. స్వయం ఉపాధికి శిక్షణ కూడా ఇస్తుంటారు. ప్రస్తుతం విశాఖ సెంట్రల్ జైల్లో వివిధ వస్తువుల తయారీలో ఖైదీలకు శిక్షణ ఇస్తుండడం విశేషం. కంప్యూటర్ శిక్షణతో పాటు వాహనాల మెకానిక్, వెల్డింగ్ వంటి కోర్సుల్లో కూడా శిక్షణ ఇస్తున్నారు. చదువుకోవాలనే వారికి దూరవిద్య ద్వారా పరీక్షలు రాయిస్తున్నారు. శిక్షాకాలం వృధా కాకుండా.. వారి జైలు విడుదల తరువాత కూడా జీవితం సాఫీగా సాగేలా ప్రణాళిక రూపొందించారు విశాఖ సెంట్రల్ జైలు అధికారులు. అయితే ఇప్పటికే జైల్లో శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు కూడా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఖైదీలలో సత్ప్రవర్తన తీసుకొచ్చేందుకు ఇలా సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళుతున్నారు. అందులో భాగంగానే ఈ సరికొత్త మార్టులు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తాజా కూరగాయలతో పాటు అన్ని రకాల వస్తువులు ఇక్కడ దొరుకుతున్నాయి. దీంతో నగరవాసులు ఎక్కువగా ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. జైళ్ల శాఖ అధికారుల ఆలోచనను అభినందిస్తున్నారు.అయితే ఇక్కడ తాజా కూరగాయలు ఎక్కువగా లభిస్తుండడంతో జనాలు ఎగబడుతున్నారు. పైగా బయట మార్కెట్ ధర కంటే తక్కువగా లభిస్తున్నాయి ఇక్కడ. రసాయనాల ప్రమేయం లేకుండా ఖైదీలు కూరగాయలు పండిస్తుంటారు. అలా వారు పండించిన ఆకుకూరలు, వంగ కాకర, ఆనప, టమోటా, ఆగాకర, దొండకాయ, బెండకాయ, మునగ కాడలు, క్యారెట్, బీట్రూట్, చిక్కుడుకాయ, బీరకాయ, పొట్లకాయ, ముల్లంగి మొదలైన వాటిని విక్రయిస్తున్నారు. అయితే విశాఖ లాంటి నగరంలో రైతు బజార్లు అందుబాటులోకి వచ్చినా అవి చాలడం లేదు. అయితే ఈ సుధార్ మార్టుల్లో తాజా కూరగాయలు లభిస్తుండడం.. బయట ధర కంటే తక్కువగా ఉండడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు.

# శ్రావణమాసంలో పెరిగిన చికెన్, మటన్ ధరలు




విశాఖపట్టణం, : ఆంధ్రప్రదేశ్‌లో శ్రావణమాస శోభ కనిపిస్తోంది.. మహిళలు పూజల్లో, వరలక్ష్మి వ్రతాల్లో బిజీగా ఉన్నారు. అయితే ఆనవాయితీ ప్రకారం శ్రావణమాసంలో చికెన్ రేట్లు, గుడ్ల రేట్లు తగ్గాలి.. కానీ ఈసారి విచిత్రంగా ధరలు పెరిగాయి. ఏపీలోని పలు జిల్లాల్లో చికెన్ ధరలు గత శ్రావణ మాసంతో పోలిస్తే పెరిగాయట. ఫారం దగ్గర కిలో కోడి మాంసం ధర మాత్రం రూ.220కి చేరింది. రెండు వారాల కిందట ఈ ధర రూ.170 మాత్రమే ఉందంటున్నారు. శ్రావణమాసంలో కోళ్లను మాంసం కోసం అమ్మడంతో గుడ్ల ఉత్పత్తి మరింత తగ్గింది.. ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల కోళ్లు తక్కువ గుడ్లు పెడుతున్నాయి. శ్రావణ మాసంలో రేట్లు పెరగడానికి.. ఉత్పత్తి తగ్గడానికి తోడు రాష్ట్రంలో శుభకార్యాలు ఉండటమే కారణం అంటున్నారు.ఇక కోడిగుడ్ల విషయానికి వస్తే.. ఫారం దగ్గర గుడ్డు ధర రూ.5.10కి చేరింది. అయితే ఈ నెల మొదట్లో దీని ధర రూ.4.60గా ఉంది అంటున్నారు. ఇక షాపుల విషయానికి వస్తే.. గుడ్డు రూ.6.50 నుంచి రూ.7 వరకు అమ్ముతున్నారు. గుడ్ల ఉత్పత్తి తగ్గడం వల్ల ధరలు పెరిగాయని రైతులు అంటున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండటం కూడా ధరల పెరుగుదలకు ఒక కారణం అంటున్నారు. గుడ్ల ధరలు పెరుగుతుండటంతో రైతులు కోళ్లను అమ్మడానికి ఇష్టపడటం లేదు. తూర్పుగోదావరి జిల్లా నుండి ఇతర ప్రాంతాలకు గుడ్లు, మాంసం ఎగుమతి అవుతాయి. గతంలో రోజుకు కోటి గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. కానీ ఇప్పుడు ఫారాలు తగ్గడంతో 80 లక్షల గుడ్లు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయివీటికి తోడు కోళ్ల పరిశ్రమకు దాణా ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోందట. నెల రోజుల క్రితం రూ.30 ఉన్న సోయా ధర ఇప్పుడు రూ.42 దాటింది అంటున్నారు. మొక్కజొన్న, వరినూక ధరలు కూడా పెరిగాయి.. ఇథనాల్ పరిశ్రమల్లో వీటి వాడకం పెరగడంతో ఈ పరిస్థితి వచ్చింది అంటున్నారు. కోళ్లు, చేపలు, పశువుల దాణా ధరలు పెరిగాయి.. మొక్కజొన్న, వరి ధాన్యం ఎగుమతి అవుతాయనే వార్తలు పరిశ్రమను కలవరపెడుతున్నాయట. మొత్తం మీద శ్రాణ మాసంలో ఏపీలో చికెన్, గుడ్ల ధరలు పెరగడం ఆసక్తికరంగా మారింది.

## నల్లబెల్లం పట్టిక ను మున్నేరు వాగులో ధ్వంసం చేసిన ఎక్సైజ్ -పోలీస్ అధికారులు

మహబూబాబాద్,:మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ మహబూబాబాద్, గూడూరు మరియు పోలీస్ సబ్ డివిజన్ మహబూబాబాద్ పరిధిలో గల పోలీస్ స్టేషన్లలోదాపు గత సంవత్సరం నుండి నాటు సారాయి తయారీ కొరకు రవాణా చేస్తూ పట్టు బడినటువంటి (500) క్వింటా ళ్ల నల్ల బెల్లం మరియు (50) క్వింటాళ్ల పటిక ను వరంగల్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి. అంజన్ రావు ఆదేశాల మేరకు మహబూబా బాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి బి.కిరణ్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ మున్సిపాలిటీ సమీపంలో గల మున్నేరు వాగు ప్రవాహంలో మరియు బయ్యారం,

డోర్నకల్ మండలాలలో ప్రవహిస్తున్నటువంటి మున్నేరు వాగులో అట్టి నల్ల బెల్లం మరియు పటికను పారవేసి ధ్వంసం చేయడం



జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డిఎస్పీ తిరుపతి రావు , మహబూబాబాద్ రూరల్ సిఐ, డోర్నకల్ సీఐ, బయ్యారం-గార్ల సీఐలు, ఎస్సైలు మరియు మహబూబాబాద్, గూడూరు ఎక్సైజ్ సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# సినిమా..

## రూ.7.60 కోట్ల బకాయిలు.. వేలానికి నటుడు జయం రవి ఇల్లు




ప్రముఖ తమిళ నటుడు జయం రవి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. చెన్నైలోని ఇంజంబాకంలో నివసిస్తున్న ఆయన ఇంటిని ఓ ప్రైవేట్ బ్యాంకు వేలం వేయడానికి సిద్ధమైంది. తీసుకున్న రుణానికి సంబంధించిన వాయిదాలు చెల్లించకపోవడంతో, బ్యాంకు అధికారులు ఆయన ఇంటికి వేలం నోటీసులు అంటించారు. ఈ ఘటన కోలీవుడ్‌లో సంచలనంగా మారింది. ఈ ఇంటి కోసం జయం రవి (అసలు పేరు రవి మోహన్) ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి పెద్ద మొత్తంలో రుణం తీసుకున్నాడు. అయితే నెలవారీ వాయిదాలను సకాలంలో చెల్లించడంలో విఫలమయ్యాడు. దీంతో బకాయిలు రూ. 7.60 కోట్లకు పైగా పేరుకుపోయినట్లు బ్యాంకు జారీ చేసిన నోటీసులో స్పష్టం చేసింది. బకాయిలు చెల్లించాలని గతంలో ఎన్నోసార్లు గుర్తుచేశామని, అయినా ఆయన నుంచి స్పందన రాకపోవడంతోనే ఈ చర్యలు తీసుకున్నామని బ్యాంకు వర్గాలు పేర్కొన్నట్లు సమాచారం. జయంరవి మరో వివాదంలో కూడా చిక్కుకున్నారు. 'టచ్‌గోల్డ్ యూనివర్సల్' అనేనిర్మాణ సంస్థ ఆయనపై తీవ్ర ఆరోపణలు చేస్తోంది. తమ సంస్థలో రెండు సినిమాలు చేసేందుకు గాను ఆయన రూ.6 కోట్లు అడ్వాన్స్‌గా తీసుకున్నారని, కానీ ఆ చిత్రాల్లో నటించకుండా ఇతర ప్రాజెక్టులకు వెళ్లిపోయారని ఆ సంస్థ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో నటుడి ఇంటిని జప్తు చేయాలని సదరు నిర్మాణ సంస్థ కూడా కోరినట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒకేసారి బ్యాంకు, నిర్మాణ సంస్థల నుంచి ఒత్తిడి ఎదుర్కోవడంతో జయం రవి తీవ్ర సంక్షోభంలో ఉన్నట్లు స్పష్టమవుతోంది.

## సమంత ధరించిన లగ్జరీ వాచ్ చూశారా..



తెలుగు, తమిళ ఇండస్ట్రీలలో తన నటనతో పాటు స్టైలిష్ ఫ్యాషన్ సెన్సేషన్‌గా నిలిచిన అందాల తార సమంత తాజాగా కొత్త లగ్జరీ వాచ్ ధరించి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. ఇటీవల సమంత సినిమాల కన్నా కూడా బ్రాండ్లని ప్రమోట్ చేస్తూ ఎక్కువగా వార్తలలో నిలుస్తుంది. తాజాగా ఒక లగ్జరీ వాచ్ ను ధరించిన సామ్ అందుకు సంబంధించిన ఫొటోలను షేర్ చేయగా,ఇవి నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అయితే సమంత ధరించిన ఆ వాచ్ అందరి దృష్టిని ఆకర్షించగా, అది ఏ కంపెనీది..? దాని ధర ఎంత ? అంటూ గూగుల్ లో ఆరా తీస్తున్నారు.

## రిచర్డ్ రిషి నటించిన 'ద్రౌపది 2' చిత్రీకరణ పూర్తి



జి.ఎం. ఫిల్మ్ కార్పొరేషన్‌తో కలిసి నేతాజీ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద చోళ చక్రవర్తి నిర్మిస్తున్న చిత్రం 'ద్రౌపది 2'. తమిళ–తెలుగు ద్విభాషా చిత్రంగా రాబోతోన్న ఈ ప్రాజెక్ట్‌కి మోహన్.జి దర్శకత్వం వహించారు. ఈ మూవీలో రిచర్డ్ రిషి ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. ఈ హిస్టారికల్ యాక్షన్ డ్రామాకు సంబంధించిన షూటింగ్ నేటి(సెప్టెంబర్ 23)తో ముగిసింది. ఈ మేరకు దర్శక, నిర్మాతలు సినిమా గురించి కొన్ని విశేషాల్ని పంచుకున్నారు. దర్శకుడు మోహన్.జి మాట్లాడుతూ .. 'దర్శకుడు ఎంత జాగ్రత్తగా ప్లాన్ చేసినా, చివరికి నిర్మాత సపోర్ట్, మద్దతుతోనే షూటింగ్‌ను పూర్తి చేయగలం. చిత్రీకరణమైన సమయంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా కూడా నిర్మాత చోళ చక్రవర్తి ఇచ్చిన సపోర్ట్‌తోనే చిత్రీకరణను పూర్తి చేయగలిగాను. ఆయనకు ఇది తొలి ప్రాజెక్ట్ అయినప్పటికీ, సినిమా పట్ల ఆయనకున్న ప్యాషన్, ఇష్టం, అనుభవం, కళ, విజన్ వల్లే ఇంత గ్రాండ్‌గా చిత్రీకరించగలిగాం. సృజనాత్మక స్వేచ్ఛను ఇవ్వడంతో ఈ మూవీని అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కించానని అనుకుంటున్నాను' అని అన్నారు. నిర్మాత చోళ చక్రవర్తి మాట్లాడుతూ ..

"దర్శకుడు మోహన్. జి గారితో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. ఆయన సినిమాను తెరకెక్కించిన తీరు నన్ను బాగా ఆకట్టుకుంది. షూటింగ్ అనుకున్న దానికంటే ముందే పూర్తయింది. నిర్మాతగా నాకు ఉండే ఎన్నో అనుమానాల్ని ఆయన నివృత్తి చేసిన విధానం నాకు నచ్చింది. ఈ ప్రయాణంలో నాకు సపోర్ట్‌గా నిలిచిన మోహన్ గారికి ధన్యవాదాలు. ఆయన ఇచ్చిన సపోర్ట్ వల్లే ఈ తరహాలో మరిన్ని చిత్రాలను నిర్మించాలనే నా సంకల్పాన్ని బలోపేతం చేసింది' అని అన్నారు. ఈ చిత్రంలో రక్షణ ఇందుసుదన్ కథానాయికగా నటించారు. నట్టి నటరాజ్, వై.జి. మహేంద్రన్, నాడోడిగల్ బరణి, శరవణ సుబ్బయ్య, వేల్ రామమూర్తి, సిరాజ్ జానీ, దినేష్ లాంబా, గణేష్ గౌరంగ్, దివి, దేవయాని శర్మ, అరుణోదయన్ వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ చిత్రానికి మాటల్ని పద్మ చంద్రశేఖర్, మోహన్ జి రాశారు. గిబ్రాన్ వైబోధ సంగీతాన్ని సమకూర్చారు. ఈ మూవీకి సినిమాటోగ్రఫీ: ఫిలిప్ ఆర్. సుందర్, కొరియోగ్రఫీ: థానికా టోనీ, స్టంట్ కోఆర్డినేషన్: యాక్షన్ సంతోష్, ఎడిటింగ్: దేవరాజ్, ఆర్ట్ డైరెక్షన్: కమల్నాథన్. 'ద్రౌపది 2' చిత్రంలో.. ప్రేక్షకులను 14వ శతాబ్దంలోకి తీసుకు వెళ్లి, ఆనాటి దక్షిణ భారతదేశ వైభవాన్ని కళ్లకు కట్టినట్టుగా చూపించబోతోన్నారు. అద్భుతమైన కథ, విజువల్స్, తారాగణంతో కూడిన చిత్రాన్ని ఆడియన్స్ ముందుకు తీసుకు రాబోతోన్నారు. ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతున్నాయి. డిసెంబర్‌లో నెలలో మూవీని గ్రాండ్‌గా రిలీజ్ చేయాలని మేకర్లు ప్లాన్ చేస్తున్నారు. నటీనటులు : రిచర్డ్ రిషి, రక్షణ ఇందుసుదన్, నట్టి నటరాజ్, వై.జి. మహేంద్రన్, నాడోడిగల్ బరణి, శరవణ సుబ్బయ్య, వేల్ రామమూర్తి, సిరాజ్ జానీ, దినేష్ లాంబా, గణేష్ గౌరంగ్, దివి, దేవయాని శర్మ, అరుణోదయన్ తదితరులు


## ఏటీఎం నుంచి పీఎఫ్ విత్‌డ్రా: ముహూర్తం ఫిక్స్!



ఈపీఎఫ్ఓ డబ్బును ఏటీఎం నుంచి తీసుకోవడానికి కావలసిన ఏర్పాట్లు జరుగుతున్నట్లు.. కేంద్ర కార్మిక %ద% ఉపాధి మంత్రి మన్సుఖ్ మాండవీయ ఈ ఏడాది ప్రారంభంలోనే పేర్కొన్నారు. ఇది జూన్ నుంచి అమలులోకి రానున్నట్లు గతంలో కొన్ని వార్తలు వినిపించినప్పటికీ.. ఈ సౌకర్యం 2026 జనవరికి అందుబాటులో వచ్చే అవకాశం ఉంది. ఈపీఎఫ్ఓ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ అయిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ , వచ్చే నెల మొదటి అర్ధభాగంలో ఒక సమావేశం ఏర్పాటు చేయనుంది. ఆ సమావేశంలో దీనికి సంబంధించిన ప్రతిపాదన చేపట్టే అవకాశం ఉంది. ఆ తరువాత ఏటీఎం నుంచి పీఎఫ్ అమౌంట్ విత్‌డ్రా అందుబాటులోకి వస్తుంది. చందాదారులు తమ పీఎఫ్ డబ్బును తీసుకోవడం మరింత సులభతరం చేయడంలో భాగంగానే.. ఈపీఎఫ్ఓ 3.0 కింద ఏటీఎం నుంచి విత్‌డ్రా చేసుకునే సదుపాయం కల్పిస్తోంది. ఈ కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి మంత్రిత్వ శాఖ బ్యాంకులతో పాటు ఆర్‌బీఐతో కూడా మాట్లాడినట్లు సమాచారం. ప్రస్తుతం ఈపీఎఫ్ఓ ??కార్పస్ మొత్తం రూ. 28 లక్షల కోట్ల కంటే ఎక్కువ ఉంది. మొత్తం సహకార సభ్యులు దాదాపు 78 మిలియన్లు. అత్యవసర సమయంలో ఉద్యోగులు తమ ఈపీఎఫ్ఓలో కొంత భాగాన్ని తీసుకోవాలంటే.. ఆన్‌లైన్‌లో అప్లై చేసి కొన్ని రోజులు వేచి చూడాల్సి ఉంది. ఇది కొంత ఆలస్యమైనా ప్రక్రియ. ఈ ఆలస్యానికి చెక్ పెట్టడానికే ఏటీఎం నుంచి పీఎఫ్ డబ్బును తీసుకోవడానికి వెసులుబాటు కల్పిస్తున్నారు.

## డిజిటల్ చెల్లింపులకు కొత్త మార్గదర్శకాలు

డిజిటల్ చెల్లింపులకు సంబంధించి టూ ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ (2ఎఫ్ఏ) కింద ఎస్ఎంఎస్ ఆధారత ఓటీపీకి అదనంగా మరిన్ని మార్గాలకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. పాస్‌వర్డ్, ఎస్ఎంఎస్ ఆధారిత ఓటీపీ, పాస్‌ఫ్రేజ్, పిన్, కార్డ్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ టోకెన్, ఫింగర్‌ప్రింట్ లేదా ఇతర బయోమెట్రిక్స్ (ఆధార్ ఆధారిత) ఆథెంటికేషన్‌కు వీలు కల్పించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. 2ఎఫ్ఏ తప్పనిసరి అంటూ, ఇకపైనా ఎస్ఎంఎస్ ఓటీపీని వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది.






## 3 నెలల్లో 11 వేల ఉద్యోగాలు తొలగించిన ఐటీ కంపెనీ

ప్రముఖ మల్టీనేషనల్ ఐటీ కంపెనీ యాక్సెంచర్ గత మూడు నెలల్లో 11,000 మందికిపైగా ఉద్యోగులను తగ్గించింది. రానున్న రోజుల్లో మరిన్న కోతలు ఉంటాయని సంకేతాలు ఇచ్చింది. ఏఐ కార్యాచరణకు సరిపోయేలా ఉద్యోగులకు నైపుణ్యాలు పెంచడం సాధ్యపడకపోతే తొలగించడమే ( %శ్రీఖఎ–శీటటం%) మార్గమని త్రైమాసిక ఫలితాల వెల్లడి సందర్భంగా కంపెనీ స్పష్టం చేసింది.తాజాగా జరిగిన ఎర్నింగ్ కాల్ సందర్భంగా యాక్సెంచర్ సీఈవో జూలీ స్వీట్ మాట్లాడుతూ.. కార్యాచరణ అవసరాలను ఏఐ సమూలంగా మార్చేస్తున్న తరుణంలో రీస్కిల్లింగ్ సాధ్యంకాని ఉద్యోగాలను కంపెనీ తొలగిస్తుందన్నారు. అయితే ఖచ్చితంగా సంఖ్య ఎంతన్నది ఆమె స్పష్టం చేయలేదు. యాక్సెంచర్‌లో మూడు నెలల క్రితం మొత్తం 791,000 మంది ఉద్యోగులు ఉండగా ఈ ఆగస్టు చివరి నాటికి ఆ సంఖ్య 779,000 మందికి తగ్గింది. యాక్సెంచర్ ఆదాయం జూన్–ఆగస్టు 2025 త్రైమాసికంలో 17.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. సంవత్సరానికి 7 శాతం పెరుగుదలను నమోదు చేసింది. సెప్టెంబర్–ఆగస్టు ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 2.5 శాతం విదేశీ మారక ద్రవ్య ప్రభావంతో దాని ఆదాయాలను ప్రభావితం




చేసిందని తెలిపింది. కొనసాగుతున్న పోర్ట్ ఫోలియో ఆప్టిమైజేషన్ లో భాగంగా, యాక్సెంచర్ కొన్ని నాన్–కోర్ వ్యాపారాల నుండి నిష్క్రమించనున్నట్లు, 865 మిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను ఉపసంహరించుకునే ప్రణాళికలను కూడా ప్రకటించింది.

## 'ఉద్యోగ భద్రత ఒక జోక్': రాబర్ట్ కియోసాకి



ఎప్పుడూ బిట్‌కాయిన్, బంగారం వంటి వాటిలో పెట్టుబడి పెట్టాలని చెప్పే.. రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత 'రాబర్ట్ కియోసాకి', ఇప్పుడు ఉద్యోగ భద్రత అనేది ఒక జోక్ అంటూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రభుత్వం మూతపడిందా?, ఉద్యోగాల తొలగింపు ఉంటుందా?, మీరు ఉద్యోగం కోల్పోవడానికి సిద్ధంగా ఉన్నారా?, ఈ మెసేజ్ అర్థమైందా? అంటూనే.. ఉద్యోగ భద్రత ఒక జోక్ అని రాబర్ట్ కియోసాకి పేర్కొన్నారు. ఉద్యోగిగా కాకుండా వ్యవస్థాపకుడిగా మారడం గురించి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. మార్కెట్లో అనుకోని మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయని రాబర్ట్ కియోసాకి హెచ్చరించారు. 1976 నుంచి అమెరికా వివిధ స్థాయిలలో 22 షట్‌డౌన్‌లను ఎదుర్కొంది. 2018లో 34 రోజులు మార్కెట్ అత్యల్ప స్థాయిలో కొనసాగింది. ఆ తర్వాత స్టాక్‌లు, బిట్‌కాయిన్ రెండూ కోలుకోవడం ప్రారంభించాయి. చరిత్ర ప్రకారం.. షట్‌డౌన్‌లు కొన్ని రోజులు మాత్రమే ఉంటాయి. సగటున 2–4 వారాల పాటు ఉంటాయి. ఎలాంటి సమయంలో అయినా.. బిట్‌కాయిన్ బలంగా ఉంటుంది. గత సంవత్సరం మార్చిలో పరిస్థితులు కొంచెం అనిశ్చితంగా కనిపించినప్పుడు, గడువుకు ముందు వారంలో బిట్‌కాయిన్ 16% పెరిగి 62,700 డాలర్ల నుంచి 73600 డాలర్లకు పెరిగింది. ప్రస్తుతం దీని విలువ ఊహకందని రీతిలో భారీగా పెరిగింది. సొంతంగా వ్యాపారాన్ని ప్రారభించడం లేదా బిట్‌కాయిన్ వంటివాటిలో పెట్టుబడి వంటివి మీకు ఆర్థిక స్వేచ్ఛను ఇస్తుందని కియోసాకి సందేశం చెబుతోంది. దీనిపై పలువురు నెటిజన్లు తమదైన రీతిలో స్పందిస్తున్నారు.

## అనిశ్చితిలోనూ పటిష్టంగా భారత్: నిర్మలా



అంతర్జాతీయంగా అనిశ్చితి వల్ల పలు దేశాలు సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ భారత్ పటిష్టంగా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. యువ జనాభా, దేశీయంగా డిమాండ్ మెరుగ్గా ఉండటం, స్థిరమైన ఆర్థిక విధానాలు ఎకానమీ వృద్ధికి దోహదపడుతున్నాయని చెప్పారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 91వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆమె ఈ విషయాలు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్%–%జూన్ త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని, ఎస్అండ్‌పీలాంటి రేటింగ్ ఏజెన్సీలు కూడా దేశ రేటింగ్‌ను పెంచాయని మంత్రి చెప్పారు. భారత్‌పై ప్రపంచానికి గల నమ్మకానికి ఇది నిదర్శనమని వివరించారు. వృద్ధి సాధనలో కీలక పాత్ర పోషించే బ్యాంకులు, కస్టమర్ల నమ్మకాన్ని చూరగొనడం, ఫిర్యాదులను సత్వరం పరిష్కరించడంపై మరింతగా దృష్టి పెట్టాలని సూచించారు.

## సేఫ్టీలో 5 స్టార్ రేటింగ్: క్రాష్ టెస్ట్‌లో ఇన్విక్టో రికార్డ్!

మారుతి సుజుకి ఇన్విక్టో.. భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్ (%దీచీజాూా%) పరీక్షలో 5 స్టార్ రేటింగ్ సాధించింది. దీంతో ఈ ఎంపీవీ దేశంలోని అత్యంత సురక్షితమైన కార్ల జాబితాలో ఒకటిగా నిలిచింది. మారుతి ఇన్విక్టో.. వయోజన ప్రయాణీకుల రక్షణలో 32 పాయింట్లకు 30.43 పాయింట్లు స్కోర్ చేయగలిగింది. పిల్లల రక్షణలో 49 పాయింట్లకు 45 పాయింట్లు సాధించింది. ఫ్రంటల్ ఆఫ్‌సెట్ డిఫార్మబుల్ బారియర్ టెస్ట్‌లో 16 పాయింట్లకు 14.43 పాయింట్లు సాధించగా, సైడ్ మూవబుల్ డిఫార్మబుల్ బారియర్ టెస్ట్‌లో 16 పాయింట్లు పరిపూర్ణ స్కోరు లభించింది. ఇలా మొత్తం మీద సేఫ్టీలో 5 స్టార్ రేటింగ్ సొంతం చేసుకుంది. భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్ పరీక్షకు ఉపయోగించిన కారు.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215